RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 250 ISSUE NO : 250 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, ఏప్రిల్, 1, 2026 Wednesday, April,1 , 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## కేరళం ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** వచ్చే నెలలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగను న్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు ప్రచారం లో బిజీ బిజీగా ఉన్నాయి. కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఖ్యనేతలు సైతం కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని మరింత బలోపేతం చేయడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగుతున్నారు. అక్కడ రెండు రోజుల పాటు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. రేవంత్ రెడ్డిని కేరళం ఎన్నికల కోసం స్టార్ క్యాంపెయినర్‌గా కాంగ్రెస్ పార్టీ నియమిం చింది. ఈ నేపథ్యంలో ఆయన పలు ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. ఆయన ప్రచారం.. పార్టీకి కొత్త ఊపు తీసుకొస్తుందని నేతలు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే, తెలంగాణకు చెందిన మరో కీలక మంత్రి శ్రీధర్ బాబు కూడా కేరళంకు బయలుదే రనున్నారు. ఆయనకు ఎర్నాకులం, హోసూరు జిల్లాల ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. ఏప్రిల్ 7 వరకు అక్కడే ఉండి ప్రచారం కొనసాగించనున్నారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేరళంలో ప్రచారం ప్రారంభించారు. పతినంతిట్ట జిల్లాలోని ఆడూరు, అరుణ్మల నియోజకవర్గాల్లో ఆయన పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు.



## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

- ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు
- మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత

**తిరువనంతపురం,మార్చి31 :** కేరళ అసెంబ్లీ ఎన్ని కల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వ హించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమో క్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరే కంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు.



స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవింద న్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు.



## మసూద్ అజర్‌కు.. మరో షాక్

### పాకిస్థాన్‌లో సోదరుడి అనుమానాస్పద మృతి!

ఢిల్లీ,: భారత్‌లో అనేక భయానక ఉగ్రదాడులకు పాల్పడిన జైషే మహమ్మద్ (జీవవీ) ఉగ్రవాద సంస్థ అధినేత మసూద్ అజర్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అతడి సోదరుడు, సంస్థలో కీలక వ్యక్తిగా ఉన్న మహమ్మద్ తాహిర్ అన్వర్ పాకిస్థాన్‌లో మరణించాడు. అయితే అతడి మృతికి గల కారణాలపై స్పష్టత లేకపోవడంతో ఇది సహజ మరణం కాకపోవచ్చనే అనుమానాలు బలపడుతు న్నాయి. తాహిర్ అన్వర్ మరణించిన విషయాన్ని జైషే మహమ్మద్ సంస్థ తన అధికారిక ఛానల్ ద్వారా ధ్రువీకరించింది.



## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ డ్రోన్ దాడి

### భారీగా చెలరేగిన మంటలు

కువైట్ : ఇరాన్ గల్ఫ్ దేశాలపై తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్ కు చెందిన ఓ చమురు ట్యాంకర్ పై భీకర దాడిచేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఈ ఘటనను ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ' అనే భారీ ముడిచ మురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది.



## శీతల అష్టమి ఆలయంలో తొక్కిసలాట

### 8 మంది మహిళలు మృతి

### చద్దన్నం ప్రసాదం సమర్పణకు ఎగబడిన భక్తులు

నలంద: బిహార్‌లోని నలందలో విషాద ఘటన జరిగింది. చైత్ర మాసంలో చివరి మంగళవారం కావడంతో మాతా శీతలాష్టమి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సమయంలో తీవ్ర తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 8 మంది చనిపోయారు.నలందలోని మాఘ్రాలో ఉన్న మాతా షీత్లా దేవి ఆలయంలో ఈ దురదృష్ట ఘటన జరిగింది. చనిపోయిన ఎనిమిది మంది మహిళలే కావడం శోచనీయం. ఈ తొక్కిలాట ఘటనలో మరో ఆరుగురు భక్తులు కూడా గాయపడ్డారు. ఈ తొక్కిసలాట కారణంగా ఆలయంలో భక్తులు భయంతో కేకలేశారు. అక్కడ నుంచి బయటపడే ప్రయత్నం చేశారు.



## అమెరికాతో చర్చల్లేవ్.. తేల్చేసిన ఇరాన్

ఢిల్లీ,:అమెరికాతో తాము ఎలాంటి చర్చలు జరపడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో జరుగుతున్న యుద్ధం రెండో నెలలోకి ప్రవేశిం చిన తరుణంలో, చర్చలు సానుకూలంగా ఉన్నాయం టూ వైట్ హౌస్ చేస్తున్న ప్రకటనలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది.



## గులాబీకి భారం అవుతున్న కౌశిక్ రెడ్డి!

**కరీంనగర్,తెలంగాణ దిశ :** కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రవర్తన మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. ఓ సారి అరికెపూడి గాంధీ ఇంటి మీదకు వెళ్లారు. ఇప్పుడు కడియంపై అదే తరహా అగౌరవం ప్రవర్తనకు పాల్పడ్డారు. నిజానికి ఈ ఇద్దరు నేతలకు.. కౌశిక్ రెడ్డికి సంబంధంలేదు. కనీసం ఆయన జిల్లా వారు కూడా కాదు. కానీ కేటీఆర్ మెప్పు పొందేందుకు కౌశిక్ రెడ్డి ఇలా చేస్తున్నారు. కేటీఆర్ కూడా కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన రెచ్చిపోతున్నారు.రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజం. కానీ, కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఇందుకు భిన్నంగా ఉంది. తన జిల్లాకు సంబంధం లేని నేతలైన కడియం శ్రీహరి లేదా అరికెపూడి గాంధీ వంటి వారిని లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక ప్రజా ప్రతినిధిగా సభలో వాడకూడని భాషను వాడటం, సీనియారిటీకి కనీస మర్యాద ఇవ్వకపోవడం వల్ల ఆయన ఇమేజ్ పక్కన పెడితే, సభా గౌరవం దెబ్బతిం టోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లు గా, ఈ సంస్కృతిని ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో అసెంబ్లీ కుస్తీ పోటీలకు, భౌతిక దాడులకు వేదికగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళనలో వాస్తవం లేకపోలేదు.కౌశిక్ రెడ్డి ఈ తరహా దూకుడు ప్రదర్శించడం వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం ఉంది. పార్టీలో తన ఉనికిని చాటుకోవడానికి, అధినాయకత్వం దృష్టిలో ఫైర్ బ్రాండ్ అనిపించుకోవడానికి ఆయన ఉద్దేశపూర్వకంగానే వివాదాలను కొనితెచ్చుకుంటున్నట్లు కనిపిస్తోంది..



## హర్మూజ్‌పై ఇరాన్ పట్టుబిగింపు

### ఇక్కడి న ఉంచే వెళ్లే నౌకలకు టోల్ వసూల్

### ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్ల టోల్

టెహ్రాన్, : చమురు రవాణాలో ప్రపంచానికి అత్యంత కీలక మైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుం ది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలపై టోల్ వసూలు చేయడానికి ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో, ఇకపై ఈ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాం కర్ల నుంచి భారీ మొత్తంలో రుసుము వసూలు చేయ నున్నారు. ఒక్కో ట్యాంకర్‌పై గరిష్ఠంగా సుమారు రూ. 18. 90 కోట్ల వరకు టోల్ విధించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.



## ఉరుములు.. మెరుపులతో వర్షం

### నిన్నటిదాకా భానుడు నిప్పులు కురిపించాడు

**సదాశివనగర్,తెలంగాణ దిశ :** నిన్నటిదాకా భానుడు నిప్పులు కురిపించాడు. జనాలను ఉక్కిరిబిక్కిరి చేసిన ఎండలు తెల్లవారుజాము నుంచే ఒక్కసారిగా చల్లబడా యి. ఈ రోజు(మంగళవారం) ఒక్కసారిగా ఉరుములు మెరుపు లతో కూడిన వర్షం పడింది. సదాశివ నగర్ మండలం లో నిన్నటి వరకు మండిపోయిన ఆకాశం, ఉదయం అయ్యే సరికి ఉగ్రరూపం దాల్చింది. ఒక్క సారిగా మేఘాలు కమ్ముకొచ్చాయి. మెరుపులు మెరుస్తుంటే, వర్షం ఊహించని రీతిలో పడింది. కాల చక్రం తలకిందు అయిందా అన్నట్లుగా వాతావర ణం మారుతుం డడం పై మండల కేంద్రంలో చర్చ నడు స్తోంది. వర్షం సామాన్యులకు ఉపశమనం కలి గించిన, రైతన్న గుండెల్లో మాత్రం రైలు పరిగెత్తిం చింది. చేతికి వచ్చిన పంటలు నాశనం అవుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# కన్నుల పండువగా ఉమామహేశ్వర దేవాలయ అష్టమ వార్షికోత్సవ వేడుకలు







**నాగారం, మార్చి 31, (తెలంగాణ దిశ) :** నాగారం పట్టణ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్ రోడ్ నెంబర్--5లో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత ఉమామహేశ్వర దేవాలయంలో అష్టమ వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారితో పాటు దుర్గ మల్లికార్జున స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు కన్నుల పండువగా నిర్వహించారు.

ఈవేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగామాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని,అన్న ప్రసాద వితరణ సేవలో పాల్గొన్నారు. అదే విధంగా మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి దంపతులు కళ్యాణ మహోత్సవం లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

## రికార్డుల ర్యాపిడో... రోజుకు 10 లక్షల రైడ్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** భారతదేశంలో అతిపెద్ద, అందుబాటు ధరల మొబిలిటీ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగిన ర్యాపిడో ఇప్పుడు హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణాలకు కీలక భాగస్వామిగా మారుతోంది. నగరంలో ప్రయాణించే ప్రజలు తమ రోజువారీ ప్రయాణాలను సులభంగా పూర్తి చేసుకునేందుకు రాపిడో మొదటి మైలు, చివరి మైలు ప్రయా ణాలను కలిపే ముఖ్యమైన సేవగా నిలుస్తోంది. ప్రస్తుతం హైదరాబా ద్‌లో రోజుకు సుమారు 1.5 లక్షలకుపైగా రాపిడో రైడ్లు మెట్రో స్టేషన్లతో అనుసంధానమై జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నా యి. ప్రయాణికులు తమ ఇంటి నుండి మెట్రో స్టేషన్‌కు చేరుకోవడానికి లేదా మెట్రో స్టేషన్ నుంచి తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి రాపిడో బైక్‌లు, ఆటోలను విస్తృతంగా వినియోగిస్తున్నా రని తేలింది. అంతేకాకుండా, రాపిడో యాప్ ద్వారా రోజుకు దాదాపు 30,000 మెట్రో టికెట్లు బుక్ అవుతున్నాయి.

ఇది నగరంలో సమగ్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని చూపిస్తోంది. రాపిడో కేవలం ఒక యాప్ మాత్రమే కాదు, హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో ఒక కీలక భాగమైపోయింది.రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ,

నగర రవాణా వ్యవస్థ సజావుగా పనిచేయాలంటే ప్రయాణం సులభంగా, నిరంతరంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రయాణికులు మెట్రో ప్రయా ణాన్ని రాపిడో బైక్‌లు, ఆటోలతో కలిపి వేగంగా, సమయపాలనతో ప్రయాణిస్తున్నారని చెప్పారు.

# బీసీ ఎంప్లాయిస్ యూనియన్ కుషాయిగూడ డిపో గౌరవ అధ్యక్షులుగా పనగట్ల చక్రపాణి గౌడ్



**కుషాయిగూడ, మార్చి 31, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఎంప్లాయిస్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కుషాయిగూడ డిపో గౌరవ అధ్యక్షుడిగా పనగట్ల చక్రపాణి గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, టిజిఎస్ ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, నూతనంగా ఎన్నికైన సభ్యులను పరిచయం చేశారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారపు నర్సయ్య, యువజన విభాగం.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరమల్ల అనిల్ పటేల్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, జిల్లా యువత అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు నీరుడు శాలిని, జిల్లా నాయకులు ప్రవీణ్, యువజన కార్యదర్శి మహేష్ గౌడ్, అభిరామ్, కమలాకర్, రాచమల్ల లక్ష్మయ్య, గడ్డం శ్రీధర్ యాదవ్, సోషల్ మీడియా మురళి, భరత్, సాయి, బాసిద్, నజ్రిన్ సుల్తానా, అనిల్, జి. కృష్ణ కుమార్, పులిపాటి శ్రీనివాస్, రాంగిరివార్ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీ బీసీ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. సంపత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పొన్న హరికిషన్, జాయింట్ సెక్రటరీ సాజిద్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుర్గేష్ గౌడ్, కార్యదర్శి శోకం వెంకన్న, యాదగిరి, అంజయ్య, గందమళ్ళ కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# బివిఆర్ఐటి మహిళా కళాశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**కుత్బుల్లాపూర్, మార్చి 31, (తెలంగాణ దిశ) :** బాచుపల్లి బివిఆర్ఐటి మహిళా కళాశాలలో మూడు రోజుల వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న 60 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక గౌరవాన్ని, ఉత్సాహాన్ని నింపింది. దేశంలోని అన్ని ప్రధాన కళాశాలలో నుండి హాజరైన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని తమ ప్రతిభను ప్రదర్శించడం ద్వారా ఈ కార్యక్రమం జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకుంది. మంగళవారం ప్రారంభమైన సీనర్జీయ 2026 మొదటి రోజైన మంగళవారం సాంకేతిక కార్యక్రమాలతో, రెండవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, మూడవరోజు కళాశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నామని యాజమాన్యం తెలిపింది. మొదటి రోజు విద్యార్థులు జ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మకతను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా విభాగాల సమన్వయంతో అనేక పోటీలు నిర్వహించాయి. కోడింగ్ పోటీలు, ప్రాజెక్టు ప్రదర్శనలు, పేపర్ ప్రజెంటేషన్, సాంకేతిక క్విజ్ లు, డిజైన్ చాలెంజ్ లు వంటి విభిన్న కార్యక్రమాలు విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాన్ని కల్పించాయి. ఈ పోటీలలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను



ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎన్ సునీత సభను ఉద్దేశించి ప్రసంగించారు. భవిష్యత్తు సవాలను ఎదుర్కోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని అందుకు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని ఆమె కోరారు. ప్రధాన అతిథిగా వే జిల్లా హిమబిందు విద్యార్థులకు తమ సందేశాన్ని అందించారు. అనంతరం సాంస్కృతిక విభాగాధిపతి కె. వర్ష మూడు రోజులపాటు జరగనున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఒక పండుగ వాతావరణంలో కళాశాల మొదటి రోజు కార్యక్రమాలు నిర్వహించినట్లు బివిఆర్ఐటి మహిళా కళాశాల యాజమాన్యం తెలిపింది.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

## - కొలను హనుమంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత

**కుత్బుల్లాపూర్, మార్చి 31, (తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందజేయడం కొనసాగుతోంది. మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హనుమంత్ రెడ్డి పలువురు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాలు (చెక్కులు) అందజేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన ఏనుగుల విజయకు రూ.19 వేలు, బాచుపల్లి పోలీసు వాసుదేవరెడ్డికి రూ.60 వేలు, రాజేశ్వర్ రెడ్డికి రూ. 60 వేలు, పోచారం కీర్తికి రూ. 44,500, సూరారం నివాసి వినోద్‌కు రూ.60 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఆర్థికంగా బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా



పెద్ద ఎత్తున సహాయం అందుతున్నదని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఈ నిధులు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనారోగ్యం బారిన పడిన ప్రతి పేద వ్యక్తి ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవచ్చని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 130 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామచందర్, నరసింహ గౌడ్, కొలను జీవన్ రెడ్డి, సీతారాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బాల్ రెడ్డి, లక్ష్మణ్, పోచారం ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కాలనీల అభివృద్ధికి పెద్దపీట : నెమలి అనిల్ కుమార్



**ఉప్పల్, మార్చి 31, (తెలంగాణ దిశ) :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాలనీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం గ్రీన్ హిల్స్ కాలనీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రతి కాలనీలో మౌలిక వసతులను అభివృద్ధి చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు పనులు పూర్తయితే స్థానికులకు పెద్ద ఊరట లభిస్తుందని, రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను త్వరలోనే చేపట్టనున్నట్లు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సురాజ్, గ్రీన్ హిల్స్ కాలనీ అధ్యక్షుడు దేవిరెడ్డి రంగారెడ్డి, మాజీ అధ్యక్షుడు కొత్త మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, ఖజాంచి పూర్ణశేఖర్, వాస్పారి శ్రీనివాస్, అశోక్, దామోదర్, సత్తయ్య, రాజేష్, సాయి, హరి తదితరులు పాల్గొన్నారు.




# పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

## - చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు



**చౌటుప్పల్, మార్చి 31, తెలంగాణ దిశ) :** యాదాద్రి భువనగిరి జిల్లాను ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపుదామని చౌటుప్పల్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) గురువారావు పిలుపు నిచ్చారు. మంగళవారం చౌటుప్పల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ట్రస్మా ( ట్రస్మా) చౌటుప్పల్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గురువారావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల వెంకటేష్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. అదే విధంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పావని రమేష్‌ను ట్రస్మా సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కెవి. కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరుగు మధు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తండా కృష్ణంరాజు, మంజుల, షాహిదా బేగం, మూర్తి, శ్రీనివాస్, భాస్కరాచారి, షమీమ్, కోటేశ్వరరావు, గోపాల్ రెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి రాధిక చౌరస్తాలో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం




## - లార్డ్స్ గ్రూప్ లెర్నింగ్ స్కిల్స్ సెంటర్ ఆధ్వర్యంలో విభిన్న శిక్షణా కార్యక్రమాలు

**ఏఎస్ రావునగర్, మార్చి 31, (తెలంగాణ దిశ) :** ఏఎస్ రావునగర్ రాధిక చౌరస్తా సమీపంలో పరివార్ హోటల్ వద్ద లార్డ్స్ గ్రూప్ లెర్నింగ్ స్కిల్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్యాంప్‌లో యువతతో పాటు గృహిణుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్ ఫిట్‌నెస్‌కు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. క్యాంప్‌లో భాగంగా డాన్స్ క్లాసెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) బేసిక్ కోర్స్, గిటార్ క్లాసెస్ వంటి శిక్షణలు అందించబడనున్నాయి.

డాన్స్ క్లాసెస్ ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత, స్ట్రెస్ రిలీఫ్ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే బరువు నియంత్రణ, హార్ట్, లంగ్స్ సామర్థ్యం పెరుగుతాయని పేర్కొన్నారు. ఇక ఎఐ బేసిక్ కోర్స్ ద్వారా ఆధునిక ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చని, ప్రస్తుతం మార్కెట్లో ఎఐ నిపుణులకు మంచి డిమాండ్ ఉన్నందున ఈ కోర్స్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అదనంగా అకౌంట్స్ పేయబుల్స్ శిక్షణ కూడా అందించనున్నారు. గిటార్ క్లాసెస్‌లో పిల్లలు, యువకులు, ఆసక్తి గలవారికి బేసిక్ శిక్షణ ఇవ్వబడుతుంది.

ఈ సమ్మర్ క్యాంప్ మహేష్ నగర్, వాటర్ ట్యాంక్ సమీపంలో గురువారం మార్కెట్ ఏరియా, రాధిక క్రాస్ రోడ్స్‌లో నిర్వహించబడుతుంది. ఆసక్తి గలవారు మరిన్ని వివరాల కోసం 95737 17753 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

# సంపాదకీయం

## ఉచితాల వరదలో విజయ్..!

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి. విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది.కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీగా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక 'సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది.విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు . దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు. ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది. అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు. అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది.తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు. ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లో స్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు. యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది...

## పాలిసెట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం
# టి-సాట్ డిజిటల్ లెసన్స్

**ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి మే 12వ తేది వరకు ప్రసారాలు - రోజుకు రెండు గంటలు - 42 రోజులు - 84 పాఠ్యాంశాలు - సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి**



**శేరిలింగంపల్లి, మార్చి 31, (తెలంగాణ దిశ)** : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి టి-సాట్ డిజిటల్ లెసన్స్ అందించనుందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మే 13వ తేదీన నిర్వహించే పాలిసెట్ పరీక్ష కోసం ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి రోజుకు రెండు గంటల చొప్పున 42 రోజుల పాటు 84 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు వివరించారు. మ్యాథ్స్, కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ సబ్జెక్టుల్లో అనుభవం కలిగిన లెక్చరర్స్ బోధించిన పాఠ్యాంశాలు విద్య ఛానల్ లో సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు, రాత్రి తొమ్మిది నుండి 11 గంటల వరకు నిపుణ ఛానల్ లో పున: ప్రసారమౌతాయని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్ష పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరై మెరుగైన ఫలితాలు సాధించేందుకు టి-సాట్ పాఠ్యాంశ ప్రసారాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహ్మారావు పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయాల్లో అర్హత సాధించేందుకు విద్యార్థులకు ఎంట్రన్స్ ఉపయోగపడుతుందన్నారు.

# కుషాయిగూడలో ఘనంగా మహాలక్ష్మి పథకం విజయోత్సవాలు

## - రూ.10 వేల కోట్లకు చేరిన మహిళల పొదుపు





**కుషాయిగూడ,మార్చి 31, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో పరిధిలోని ఈసీఐఎల్ బస్టాండ్‌లో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారిందన్నారు. మహిళల సాధికారతను పెంపొందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం ఉన్న మహిళల వాటా ప్రస్తుతం 67 శాతానికి పైగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకం ద్వారా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని వెల్లడించారు. కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో రవాణా ఖర్చుల కోసం నెలకు రూ.1,500 నుంచి రూ. 2,500 వరకు ఖర్చు చేసే మహిళలు, విద్యార్థినులు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు పొదుపు చేసిన మొత్తం రూ.10 వేల కోట్లకు చేరుకోవడం ఈ పథకం విజయాన్ని సూచిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, కీర్తి కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, రాజేష్ నాయుడు, వెల్ఫేర్ మెంబర్ రాములు, మహేందర్ రెడ్డి, ఎస్ బిఐ భగవంతం, డ్రైవర్ ఉపేందర్, కండక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదం జరిగిన చోటే అనధికారిక షాపులు ఏర్పాటుకు ప్రయత్నాలు

## - అడ్డుకున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది



**కుత్బుల్లాపూర్, మార్చి 31,(తెలంగాణ దిశ)** :ప్రధాన రహదారిలో అనుమతి లేని ఫర్నిచర్ షాపుల ఏర్పాటును మంగళవారం నిజాంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అడ్డుకున్నారు. గండి మైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిలో మార్చి3 వ తేదీన ఇదే షాపులలో భారీ అగ్నిప్రమాదం సంభవించి సుమారు రూ. 5 కోట్ల వరకు నష్టం జరిగిన సంగతి తెలిసిందే. స్థానిక ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రధాన రహదారిలో ఫుట్పాతులపై వ్యాపారం నిర్వహిస్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా గతంలో అగ్నిప్రమాదం సంభవించి కోట్లాది రూపాయల నష్టం జరిగింది. నాటినుండి సుమారు 25 రోజులపాటు ఎలాంటి కార్యక్రమాలు జరపకుండా మంగళవారం రోజున తిరిగి షాపులో ఏర్పాటుకు సన్నాహాలు వ్యాపారస్తులు ప్రారంభించడంతో మధ్యాహ్నము ఒంటిగంట ప్రాంతంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది వచ్చి షాపులో ఏర్పాటును అడ్డుకున్నారు. ప్రధాన రహదారి ఫుట్ పాత్ ను ఆక్రమించి షాపుల నిర్మాణానికి షెడ్లు వేయడానికి ప్రయత్నించడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు జెసిబి సహకారంతో ఫుట్పాతుల పై ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్ షాపులను వేయకుండా ఆపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫుటుపాతులపై షాపులను నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యాపారస్తులను హెచ్చరించారు. ఫుట్ పాతులపై కాకుండా ప్రైవేటు స్థలాల్లో వ్యాపారం నిర్వహించుకోమంటూ సలహా ఇచ్చారు. ప్రభుత్వ విభాగాల అనుమతులతో వ్యాపారం నిర్వహించుకుంటే ఎవరికి ఇబ్బంది కలగదని వారు సూచించారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ కరువు : నీలం పద్మ వెంకటస్వామి





**యాదాద్రి భువనగిరి, మార్చి 31, (తెలంగాణ దిశ) :** దేశ వ్యాప్తంగా బీజేపీపాలిత రాష్ట్రాల్లో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి తీవ్రంగా విమర్శించారు. మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబా, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క ఆదేశాల మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీలం పద్మ మాట్లాడుతూ మహిళలు, బాలికల పై నేరాలు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు రాజకీయ ఆశ్రయం లభిస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నప్పటికీ, సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరిగిన మహిళలపై దాడుల ఘటనలను ప్రస్తావిస్తూ, బాధితులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల భద్రతపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "బేటీ బచావో, బేటీ పడావో" అంటూ ప్రచారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, మహిళల రక్షణలో విఫలమైందని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు మహిళా కాంగ్రెస్ తరపున పోరాటం కొనసాగిస్తామని నీలం పద్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, బ్లాక్ అధ్యక్షులు సుధా, నాగలక్ష్మి, వినోద్, మండల మరియు టౌన్ అధ్యక్షులు, ఇతర మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆస్పత్రులలో ఏఐ సాయంతో వైద్య సేవలు

గుంటూరు,తెలంగాణ దిశ : ఏపీ ప్రభుత్వం ఏఐ సాయంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 18 ప్రభుత్వాసుపత్రుల్లో సుమారు 40 పరికరాల ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద సరికొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారు. ఈ మేరకు తక్కువ సమయంలో వ్యాధులు ఖరారు చేయడం, అత్యుత్తమ వైద్యం అందిచొచ్చని చెబుతున్నారు అధికారులు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాని నిర్ణయిం చారు. రాష్ట్రవ్యా ప్తంగా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 స్టార్టప్ సంస్థలతో కలిసి వైద్య పరీక్షలు, ఇతర సేవల్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ సేవలతో అతి తక్కువ సమయంలో వ్యాధి నిర్ధారణ, రోగులకు చికిత్స అందించే సమయం కూడా ఆదా అవుతుందంటున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులు.. పార్వతీపురం, రాజానగరం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో ఈ సేవల్ని ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వీటి ఫలితాలను విశ్లేషించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదక ఇస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.వ్యాధుల్ని ప్రాథమిక పరీక్షలతో గుర్తించి.. తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. డాక్టర్లు, పేషెంట్ల మధ్య సంభాషణ రికార్డు చేస్తారు ఏఐ అప్లికేషన్ల సాయంతో పరీక్షలు చేసి ప్రాథమిక దశలోనే సమస్యల్ని గుర్తిస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తింపు, క్షయను గుర్తించడానికి, షుగర్, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు కూడా ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. గుండె సమస్యలు, ఐసీయూలో ఉన్నవారికి బీపీ, పల్స్, టెంపరేచర్, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ లాంటి మరికొన్ని చోట్లో అందుబాటులో ఉన్నాయి. ఏఐ సాయంతో ఏపీ ప్రభుత్వం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు మంత్రి సత్యకుమార్. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకేసారి 40 పరికరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. విశాఖపట్నంలో 'పింక్ సఖి శారీ వాక్' నిర్వహిం చారు.. క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వాక్‌ను రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌కు సినీ నటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకు రాలు గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ అవగాహన ర్యాలీలో నగరానికి చెందిన మహిళలు భారీగా పాల్గొన్నారు.

# మెజారిటీ మంత్రులకు ఉద్వాసన..

**విజయవాడ,తెలంగాణ దిశ :**రాజకీయాలు అన్నాక రకరకాల రూమర్లు వస్తుంటాయి. ముఖ్యంగా సర్వే సంస్థలు కొన్ని అంచనాలు వెల్లడిస్తుంటాయి.. అయితే అలా ఫలితాలు విడుదల చేసిన సర్వే సంస్థల విశ్వసనీయత బట్టి అవి ఆధారపడి ఉంటాయి. నమ్మాలా వద్దా అనేది ఎదుటి వ్యక్తి నమ్మకం బట్టి ఉంటుంది. అయితే తాజాగా సర్వేలు నిర్వహించే రైజ్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ పుల్లట రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగాదికి కానీ.. తరువాత కానీ మంత్రివర్గ విస్తరణ ఖాయమని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి ఓ ఐదుగురిని తీసుకోవడం ఖాయమని చెప్పుకొస్తున్నారు. ఆయన పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. విపరీతంగా వైరల్ అవుతుంది. 2024 జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఓ 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఒక మంత్రి పదవిని ఖాళీగా ఉంచారు. పవన్ కళ్యాణ్ కీలకమైన నాలుగు శాఖలకు మంత్రి బాధ్యతలు తీసుకోవడంతో పాటు డిప్యూటీ సీఎం హోదా కూడా తీసుకున్నారు.. అయితే ఖాళీగా ఉన్న మంత్రి పదవి ఎమ్మెల్సీ నాగబాబుతో భర్తీ చేయనున్నారు. అదే సమయంలో కొత్తగా ఓ ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. ప్రవీణ్ పుల్లట ఇదే విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ బెందాళం అశోక్, పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వేమిరెడ్డి లను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని డాక్టర్ ప్రవీణ్ పుల్లట వెల్లడించారు.ఇందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బెందాళం అశోక్ ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. సౌమ్యుడుగా పేరు ఉంది. ఈసారి ఆయనకు చాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఒకవైపు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు శ్రీనివాస్. మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించిన చివరి నిమిషంలో రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించారు. విస్తరణలో ఆయనకు తప్పకుండా ఛాన్స్ ఇస్తారని ప్రవీణ్ పుల్లట చెబుతున్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సైతం ఛాన్స్ ఉండనుంది. ఇప్పటికీ ఆయన సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో మంత్రి పదవి చేపట్టారు. మరోవైపు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు

# ఆవును చంపిన పెద్ద పులి

**రాజవొమ్మంగి,తెలంగాణ దిశ :** మండలంలోని మారేడుబాక పంచాయితీ జి.శరభవరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .... మంగళ వారం తెల్లవారుజామున జి.శరభవరం గ్రామ సమీపంలో కోసురి వీధికి చెందిన గణపతి అనే మహిళకు చెందిన ఆవుపై పులి దాడి చేసింది. ఆవు మెడ భాగంలో తీవ్ర రక్తస్రావంతో కూడిన గాయమైంది. ఆ సమయంలో అలజడి ఉండడంతో పులి ఆవును వదిలి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు.పెద్ద పులి కదలికలు ఈ ప్రాంతంలో ఉన్న నేపథ్యంలో అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి, ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

పులి దాడిచేసి హతమార్చిన ఆవును,ఆ ప్రాంతాన్ని సబ్ డిఎఫ్ ఓ సుబ్బారెడ్డి ఫారెస్ట్ సిబ్బంది ఈరోజు పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించారు. పోలవరం జిల్లాలో భయం పుట్టిస్తున్న పెద్దపులి బోనులో చిక్కకుండా హల్ చల్ చేస్తూనే ఉంది. రాజవొమ్మంగి మండలం మారేడుబాక మండలం జీ.శరభవరం గ్రామం పరిసరాల్లో నేడు పులి కదలికలు రికార్డ్ అయ్యాయని సుబ్బారెడ్డి తెలిపారు. 2 రోజులుగా ఆకలితో ఉన్న పులి మూగ జీవాలను మట్టుబెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంతాల వారిని అధికారులు హెచ్చరిస్తున్నారు.



# దేవుడిని చూద్దాం.. రండి

మనుషులుగా మనమందరం భగవంతుడి బిడ్డలం. దేవతల అనుగ్రహంతోనే మన జీవితాల్ని సార్థకం చేసుకునే ప్రయత్నం చేస్తుంటాం. ఈ క్రమంలో ఎవరి ఇష్టదైవాలు కొలువైన ఆలయాలకు వారు వెళ్లటం, అర్చనలు చేయించుకోవటం, దేవతలను ప్రార్థించటం సర్వసాధారణంగా జరుగుతుంది. కొలిచే దేవత ఎవరైనప్పటికీ ఆలయ సందర్శన మనందరి జీవితాల్లో ఓ భాగం. గుడికి వెళ్లటం ద్వారా మనకు మానసిక ప్రశాంతత లభిస్తుంది. కొండంత అండ మన చెంతనే ఉందన్న ధైర్యం కలుగుతుంది. ఇక అంతా మంచే జరుగుతుందన్న భరోసా లభిస్తుంది. ఇదంతా జరగటం వెనుక ఎన్నో ఆధ్యాత్మిక రహస్యాలు దాగున్నాయి.

ఆగమశాస్త్రాలతోపాటు పురాణాలు, శాస్త్రాలు సందర్భానుసారంగా ఆలయాలను సందర్శించుకునే విధానాన్ని, అనుసరించవలసిన నియమాలను పేర్కొంటున్నాయి. వీటన్నిటిని అవగాహన చేసుకోవాలి. మనం గుడికి వెళ్లకపోతే దేవుడు కోపిస్తాడని అనుకోవాల్సిన అవసరం లేదు. గుడికి వెళ్లకపోతే మంచి జరగదనో, శాపం తగులుతుందనే భయంతోనో ఆలయాన్ని సందర్శించాల్సిన పని లేదు. చెయ్యాల్సిం దంతా విధివిధానంగా, త్రికరణశుద్ధిగా చేసే మనం ఆలయానికి వెళ్లామా లేదా? స్వామిని దర్శించుకున్నామా లేదా? అని మాత్రమే ఆత్మపరిశీలన చేసుకోవాలి. అప్పుడు స్వామి తప్పకుండా మన గోడు వింటాడు. మనల్ని కరుణిస్తాడు. బాధలు తీరుస్తాడు.

ఆలయానికి ఎందుకు వెళ్లాలి?: ఆలయానికి వెళ్లడమంటే దేవుడిని భౌతికనేత్రాలతో చూడటం, మొక్కులు చెల్లించుకోవటం, అర్చనలు చేయించుకోవటం, తీర్థప్రసాదాలు స్వీకరించటం, మనకు అంతా మంచే జరగాలని కోరుకోవటం%% ఇవి మాత్రమే కాదు. ఇవన్నీ మనం పాటించే కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు, విధివిధానాల్లో భాగం మాత్రమే. దైవదర్శనం కోసం మనం ఏర్పాటుచేసుకున్న వ్యవస్థలో ఇవన్నీ అంతర్లీనంగా సాగుతాయి. వీటన్నిటి వెనుకా దాగి ఉన్న పరమార్థాన్ని తెలుసుకుని దైవదర్శనం చేసుకోవాలి. అప్పుడే ఆలయానికి వెళ్లిన అసలైన పరమార్థం సిద్ధిస్తుంది. ఇదంతా జరగటం కోసమే ఆలయానికి వెళ్లాలే కానీ మన కోరికల చిట్టా భగవంతుడి ముందు విప్పటానికి కాదు. కష్టాలు చెప్పుకుని కోర్కెలు విన్నవించుకోవటానికి కానప్పుడు గుడికి ఎందుకు వెళ్లాలనే ప్రశ్న కలుగుతుంది.

భగవంతుడికి మన కష్టాలు చెప్పుకోకూడదా? మొక్కుకోవటం తప్పవుతుందా? అంటే%% అవి ఎంతమాత్రం తప్పు కానే కాదు. కానీ, కేవలం మనకేదో మంచి జరిగితే నీకిది చేస్తానంటూ భగవంతుడితో బేరసారాలాడటం మాత్రం తప్పు. మనకు మంచి జరగాలని, అందుకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని తప్పనిసరిగా కోరుకోవాలి. మన ప్రారబ్ధకర్మల నుంచి విముక్తి కలిగించమని స్వామిని అనేకవిధాలుగా అర్థించాలి కూడా. అయితే ఇవి భక్తినివేదన తీరులో ఉండాలి. అంతేకానీ బేరసారాల మాదిరిగా నాకిదైతే నీకిది అన్నట్లుగా ఉండకూడదు.

ఆలయాలు అనంతమైన శక్తికి కేంద్రాలు. భక్తుడిని భగవంతుడి సన్నిధికి చేర్చే వారధి దేవాలయం. గుడి సందర్శన మనలో చైతన్యాన్ని నింపాలి. దైవికమైన భావనలు మనలో మరింతగా పెరగాలి. ధర్మబుద్ధి ద్విగుణీకృతం కావాలి. ఆలయ సందర్శన మనకు లౌకిక పరిధులు దాటి అలౌకికమైన ఆనందాన్ని కలుగజేయాలి. మనలో సానుకూల శక్తుల్ని మరింతగా వృద్ధి చెందించాలి. మనిషి మనీషిగా మారేందుకు బీజం పడాలి. ఇవన్నీ సాకారం కావటానికే ఆలయానికి వెళ్లాలి. స్వామిని దర్శించుకోవాలి. అభిషేకించాలి. అర్చించాలి. ఇదంతా జరగాలంటే ఆలయ సందర్శనలోని అసలైన ఆశయాన్ని గుర్తించాలి. అందుకు సంబంధించిన విధివిధానాలను పూర్తిగా పాటించాలి. గుడికి వెళ్లేముందుగా: ఏదైనా గుడికి వెళ్లాలని అనుకున్నప్పుడు ముందుగా కొన్ని నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ఆలయ సందర్శన హడావుడి వ్యవహారం కాకూడదు. ఇంట్లో వారు వెళ్తున్నారు కాబట్టి మొహమాటానికి, ఇక తప్పదు అన్నట్లు వెళ్లకూడదు. ఆలయ సందర్శన కూడా ఓ యజ్ఞం. గుడికి వెళ్తున్నామంటే ఓ యజ్ఞాన్ని ప్రారంభిస్తున్నట్టే లెక్క. యజ్ఞదీక్ష తీసుకున్న వ్యక్తి ఎంతటి నియమనిష్ఠలతో ఉంటాడో ఆలయ సందర్శనకు సంకల్పించుకున్న వ్యక్తి అంతే నియమాలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో ఉండాలి. పరమపవిత్రమైన ఓ కార్యానికి పూనుకొన్న వ్యక్తి ఎంతటి సహృదయంతో, ఎటువంటి వికారాలు లేకుండా ఉంటాడో ఆలయానికి వెళ్లాలనుకున్న వ్యక్తి కూడా అదేవిధంగా ఉండాలి. అప్పుడే దేవాలయాన్ని సందర్శించుకున్న పరమార్థం సిద్ధిస్తుంది. భగవంతుడితో భక్తుడికి అనుబంధం ఏర్పడుతుంది. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే ఆలయం ఓ అయస్కాంతక్షేత్రం. ఆ క్షేత్రంలోకి ప్రవేశించటానికి మనకు కొంత శక్తి అవసరమవుతుంది. ఈ శక్తి పాటించే నియమాల ద్వారా మనకు కలుగుతుంది. అయస్కాంతం ఇనుమును మాత్రమే ఆకర్షిస్తుంది. ఇనుము దృఢత్వానికి సంకేతం. భక్తుడు కూడా అంత దృఢమైన మనసుతో ఉండాలి. అప్పుడే భగవచ్ఛక్తి మనల్ని తనవైపు తిప్పుకొంటుంది.

తొలి సోపానం.. శుచిత్వం: ఆలయానికి వెళ్లాలని నిశ్చయించుకున్న వ్యక్తి పూర్తి శుచిగా ఉండాలి. శుచిత్వం అంటే ఆంతరంగికంగానూ, బాహ్యంగానూ రెండు విధాలుగా శుభ్రంగా ఉండాలి. పరిశుభ్రమైన మనసు, శరీరం అద్భుతాలను చేస్తాయి. ఆ విషయాన్ని గుర్తించిన సనాతన భారతీయ సంప్రదాయం శుభ్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ వచ్చింది. అసూయ, ఆందోళన, అనుమానం, అసహనం, ఈర్ష్య, ద్వేషం, కోపం మొదలైన అవగుణాలు లేని మనసు ఎంతో స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది. దీన్నే మానసిక శౌచం అంటారు. స్వచ్ఛమైన మనసుతో చేసే పూజ, ధ్యానం, తపం ఎంత చిన్నవైనా అనంతమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. అందుకే యోగి వేమన 'చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?' అంటారు. అలాగే మలినాలేవీ శరీరానికి అంటకుండా ఉండేలా స్నానాది విధులు చెయ్యటాన్ని బాహ్యశౌచం అంటారు. భౌతికమైన శుభ్రత మానసిక ఉన్నతికి పునాదిగా నిలుస్తుంది. శారీరకంగా, ఆంతరంగికంగా ఉండే పరిశుభ్రత మనిషికి ఏకాగ్రతను ఇస్తుంది. అతడిని లక్ష్యసాధన వైపు నడిపిస్తుంది.

అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపి వా
యస్మరేత్పుండరీకాక్షం సబాహ్యాభ్యంతరశ్శుచిః ?

నిత్యవిధుల్లో పూజా కార్యక్రమాలన్నీ ఈ శ్లోక పఠనంతోనే ప్రారంభమవుతాయి. భగవంతుడి అనుగ్రహం పొందాలంటే బాహ్య, అంతరంగ శౌచాలు తప్పనిసరి. పుండరీకాక్షుడి (విష్ణుమూర్తి) స్మరణం వల్ల శుచిత్వం వస్తుందని చెబుతుంది శ్లోకం. బలం, ఆయుష్షు, ఆరోగ్యం, సంతోషం, ఆరోగ్యవంతమైన మనసు%% ఇవన్నీ శుభ్రత వల్లనే లభిస్తాయని శాస్త్రాలు ఘంటాపథంగా చెబుతున్నాయి. శుభ్రత లేని చోట పరమాత్మ ఉండడు. స్నానం చేసి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరించి ప్రార్థన, ధ్యానం లేదా ఆలయ సందర్శన ప్రారంభించాలి. ఇది ఆధ్యాత్మిక సాధనలో తొలిమెట్టు. శాస్త్రగ్రంథాలు కూడా 'శుచిత్వం మాతరూపేణ' అని చెబుతాయి. శుచిత్వం మనకు తల్లివంటిది. తల్లి ఏవిధంగా బిడ్డకు సదా రక్షగా ఉంటుందో, అదేవిధంగా శౌచం కూడా మనల్ని రక్షిస్తుందని భావం.

సంప్రదాయ వస్త్రధారణ: ఆలయానికి వెళ్లాలని నిశ్చయించుకున్న తర్వాత పాటించాల్సిన తొలి నియమం శిరస్స్నానం చెయ్యటం. దీని ద్వారా శారీరక శుభ్రత సాధించాలి. ఆ తర్వాత శుభ్రమైన పొడివస్త్రాలు మాత్రమే ధరించాలి. గతంలో ఉపయోగించి, ఉతక్కుండా పక్కనపెట్టిన వస్త్రాలు ధరించి ఆలయానికి వెళ్లకూడదు. స్త్రీ పురుషులిద్దరూ శక్తిని బట్టి అవకాశం ఉన్నంతవరకు పట్టువస్త్రాలు, లేదంటే శుభ్రమైన సంప్రదాయ వస్త్రాలు మాత్రమే ధరించాలి. ఇందులో ఎటువంటి మినహాయింపు లేదు.

సంప్రదాయ వస్త్రాలు ధరించటం అర్థం లేని నియమం కాదు. నేటితరం అర్థం చేసుకోలేనంత విజ్ఞానం అందులో ఉంది. సంప్రదాయ వస్త్రధారణ మన మనసును పట్టి ఉంచే కళ్లెంలాగా పనిచేస్తుంది. మనం ధరించే వస్త్రాలు, వాటి రంగు మన మనసు మీద తప్పనిసరిగా ప్రభావం చూపిస్తాయి. ఆధునికత పేరుతో చిత్రవిచిత్రంగా ఉండే వస్త్రాలు ధరిస్తే వాటి ప్రభావం మనసు మీద పడి, మన ప్రవర్తన కూడా విచిత్రంగా ఉంటుంది. మనసు దేవిమీదా స్థిరంగా లగ్నం కాదు. అంతిమంగా భగవంతుడి మీద కూడా మన దృష్టి నిలవదు. ఇటువంటి వస్త్రాలతో గుడికి వచ్చారంటూ చుట్టుపక్కల వారు మనల్ని అదోరకంగా చూస్తారు. ఇది కూడా మన బుద్ధిని ప్రభావితం చేస్తుంది. అధికమైన ధర పెట్టి కొన్న వస్త్రాలు మన పటాటోపాన్ని ప్రకటించి, అహంభావాన్ని పెంచుతాయి. మన ఆలోచనంతా మన వస్త్రాలు, అందమైన అలంకరణ చూసి ఇతరులు ఏమనుకుంటున్నారో అనే భావనతో నిండిపోతుంది. భగవంతుడి సన్నిధిలో ఎటువంటి అహంకార మమకారాలు, వికారాలు పనికిరావు. మన దర్పం, ఆడంబరం స్వామిని మనకు దూరం చేస్తాయి. సర్వసాధారణంగా సంప్రదాయ వస్త్రాలు తెలుపురంగులో ఉంటాయి. తెలుపు స్వచ్ఛతకు చిహ్నం. వస్త్రాలు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయో మన మనసు కూడా అంతే స్వచ్ఛంగా ఉండాలన్న సందేశం ఇందులో దాగుంది. తెలుపురంగు మన బుద్ధిలో ఉండే ప్రకోపాల్ని నియంత్రిస్తుంది. నియంత్రిత బుద్ధి భగవంతుడి మీద మాత్రమే లగ్నమవుతుంది. తద్వారా భగవంతుడి అనుగ్రహానికి చేరువయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది. వస్త్రాల తర్వాతి అంశం అలంకరణ. దేవాలయానికి వెళ్లేటప్పుడు విపరీతమైన అలంకరణ పనికిరాదు. మనం వెళ్లేది భగవంతుడి ముందు మోకరిల్లటానికే గానీ సౌందర్యాన్ని ప్రదర్శించటానికి కాదనే విషయాన్ని గుర్తించాలి. సంప్రదాయ వస్త్రాలు ధరించిన తర్వాత స్త్రీ పురుషులిద్దరూ తిలకధారణ తప్పనిసరిగా చెయ్యాలి. తిలకం లేని నొసటితో దైవదర్శనం చెయ్యకూడదు. సంప్రదాయ భేదాలను బట్టి తిలకం, విభూది, తిరునామం%% ఏదైనా ధరించవచ్చు. తిలకం లేదా కుంకుమ ధారణ చెయ్యటానికి అర్హత లేనివారు విభూది / గంగసింధూరం ధరించాలి. ఏదోఒక తిలకం లేనిదే దైవదర్శనానికి అర్హత కలగదు. ఆడంబర ప్రదర్శన వద్దు: కుటుంబసభ్యులు లేదా మిత్రులు, బంధువులతో కలిసి ఆలయానికి వెళ్లటం చాలా మంచిది. అయితే ఈ సందర్భంలో మనం ఆడంబరం ప్రదర్శించటం మాత్రం తగదు. ఇటీవలి కాలంలో ఆలయానికి వెళ్లటం కూడా మన హోదాను ప్రదర్శించే చిహ్నంగా మారింది. ఇది పూర్తిగా తగని పని. అత్యంత వినయంగా దైవదర్శనం చేసుకోవాలి. స్వామి కోవెల ప్రాంగణంలో ప్రవేశించగానే ఆ స్వామి తప్ప మన వ్యక్తిగత స్థాయి మర్చిపోవాలి. మనసా, వాచా, కర్మణా దైవానికి మనల్ని మనం సమర్పించుకోవాలి. మనలోని అహంకారాన్ని అణచుకుని, స్వామికి శరణాగతి కావటమే దైవదర్శనం అంతరార్థం.

సమర్పణ భావమే ముఖ్యం: పూజాసామగ్రి ఏర్పాటులో ఎలాంటి లోపం చెయ్యకూడదు. అలాగని ఆర్భాటాలు చెయ్యాల్సిన పని కూడా లేదు. మన శక్తి లోపం లేకుండా దైవానికి ఏ వస్తువులు సమర్పించగలమో ఆ వస్తువులన్నిటినీ సిద్ధం చేసుకోవాలి. దైవానికి సమర్పణ చేస్తున్నామనే భావనతో పూజాద్రవ్యాలను ఏర్పాటుచేసుకోవాలి. అటువంటి ద్రవ్యాలతో చేసిన అర్చన మాత్రమే భగవంతుడికి ప్రీతిపాత్రమవుతుంది.

# అమృత ఫలం.. ఐస్ ఆపిల్!



తాటి ముంజలు.. ఎండకాలంలో మాత్రమే లభించే అమృత ఫలాలు. చూసేందుకు తెల్లని మంచు ముద్దలా నోట్లో వేసుకుంటే కరిగిపోయే వీటిని 'ఐస్ యాపిల్' అని పిలుస్తారు. ఎన్నో పోషకాలు, విటమిన్లతో నిండిన ఈ పండ్లు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు అందిస్తాయి. తాటి ముంజల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ,యాంటీబ్యాక్టీరియల్, యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్ లక్షణాలుఅధికం. ఇవి..వివిధ వ్యాధు లను దరిచేరనీయకుండా.. మన ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాయి. తాటిముంజల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి, వేసవిలో డీహైడ్రేషన్‌ను సమర్థంగా నివారిస్తాయి. వడదెబ్బకు గురైనవారికి తక్షణ ఉపశమనం అందిస్తాయి. శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెర పదార్థాలను సమతుల్యం చేస్తాయి. శరీరాన్ని చల్లబరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడతాయి. ఇందులో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇక తక్కువ కేలరీలతో కూడిన తాటిముంజలు బరువు తగ్గడంలోనూ సాయపడతాయి. ముంజల్లో లభించే యాంటీ ఆక్సిడెంట్లు.. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటివి శరీరంలో వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేస్తాయి. వీటిని తాటి ముంజలు నిర్మూలిస్తాయని పలు పరిశోధనల్లో తేలింది. అందుకే, ఐస్ యాపిల్స్‌ను రెగ్యులర్‌గా తినేవారు.. వివిధ క్యాన్సర్ల బారిన పడకుండా ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇక ఇందులోని పొటాషియం.. కాలేయ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది. ఇక చాలామంది గర్భిణులు మలబద్ధకం, అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటివాళ్లు తాటిముంజలను తీసుకుంటే.. వారి జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అసిడిటీ, మలబద్ధకం తగ్గుముఖం పడతాయి. ఎండల్లో తిరగడం వల్ల ముఖంపై వచ్చే చిన్నచిన్న మొటిమల్లాంటి పొక్కులను తాటి ముంజలు సమర్థంగా అడ్డుకుంటాయి. అయితే, కొందరు ముంజలపై గోధుమ రంగులో ఉండే పొట్టును తీసేసి.. కేవలం తెల్లటి పదార్థాన్ని మాత్రమే తింటారు.

# ఈ పొరబాట్లు చేయకండి..



చాలా మందికి టీ అనేది కేవలం ఒక పానీయం కాదు, ఒక అనుభూతి. రోజూ ఎంతో ఆసక్తిగా తాగే ఈ టీలో చేసే కొన్ని సాధారణ తప్పులు మన ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. టీని సరిగ్గా తాగకపోవడం శరీరానికి హానికరం. టీని తరచూగా తాగడం వల్ల, ఖాళీ కడుపుతో తాగడం వల్ల, లేదా ఎక్కువ టీ ఆకులను జోడించడం వల్ల టీ తాగే అలవాటు క్రమంగా శరీరానికి హాని కలిగిస్తుంది. టీ తాగేటప్పుడు ఈ తప్పులు అసలు చేయొద్దని నిపుణులు చెబుతున్నారు.

ఖాళీ కడుపుతో టీ తాగడం : కొంతమంది ఉదయం నిద్రలేచిన వెంటనే టీ తాగుతారు.. ఇది హానికరం. ఖాళీ కడుపుతో టీ తాగడం వల్ల అసిడిటీ సమస్యలు వస్తాయి. ఇది గ్యాస్, బర్నింగ్ సెన్సేషన్, మలబద్ధకం వంటి సమస్యలను కలిగిస్తుంది. కనుక టీ తాగే ముందు గోరువెచ్చని నీరు తాగాలి.

ఎక్కువ సార్లు : టీ ప్రియులు రోజుకు 4, 5 సార్లు లేదా అంతకంటే ఎక్కువ సార్లు టీ తాగుతారు. ఇలా చేయడం వల్ల శరీరంలో కెఫిన్ పరిమాణం పెరుగు తుంది. దీని వలన నిద్ర లేకపోవడం, భయం, అలసట కలుగుతుంది. అందువల్ల రోజుకు 2 కప్పుల కంటే ఎక్కువ తాగకూడదు. రాత్రి కూడా ఆలస్యంగా టీ తాగకూడదు.

ఘాటైన రుచి : ఘాటైన లేదా బాగా మరిగించిన టీని కొంతమంది ఇష్టపడతారు. ఇలా చేయడం వల్ల టానిన్, కెఫిన్ స్థాయిలు పెరుగుతాయి. ఇవి జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. కాబట్టి టీని ఎక్కువగా మరిగించి.. చాలా చిక్కగా చేయకూడదు.

భోజనం తిన్న వెంటనే : భోజనం చేసిన వెంటనే కొంతమందికి టీ తాగే అలవాటు ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. భోజనం చేసిన వెంటనే టీ తాగడం వల్ల ఆహారంలో ఉండే ఐరన్, పోషకాల శోషణ తగ్గుతుంది. టీ తాగాలనుకుంటే భోజనం చేసిన తర్వాత 30-45 నిమిషాల తర్వాత మాత్రమే తాగాలి.

తీపి టీ : ఎక్కువ చక్కెర జోడించిన తీపి టీ కొంతమంది ఇష్టపడతారు. దీంతో టీలో అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెరను కలుపుకుంటారు. అయితే అతిగా తీపి టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి, ఊబకాయం, మధుమేహం సమస్యలు వస్తాయి. వీలైతే టీలో చక్కెరను తగ్గించాలి లేదా బెల్లంని ఉపయోగించాలి.

# నోటి దుర్వాసనకు గ్లిజరిన్‌తో చెక్

కన్నీళ్లు కార్చడం కోసం నటులు గ్లిజరిన్ ఉపయోగిస్తారని తెలిసిందే. అదే గ్లిజరిన్ నవ్వులు కూడా తెప్పిస్తుందని తెలుసా? చాలామంది నవ్వలేక ఏడుస్తారు. నవ్వితే నోటి దుర్వాసనతో ఎదుటివాళ్లు ఏమనుకుంటారోనని నవ్వలేరు. నవ్వు ఆపుకోలేక నవ్వితే ఎదుటివాళ్లు నవ్వారని ఏడుస్తారు. ఇలాంటి సంకట స్థితిలో ఆ దుర్వాసనకు విరుగుడు గ్లిజరిన్. నోటి దుర్వాసనతో దీర్ఘకాలంగా బాధపడుతున్న వారికే కాదు వెల్లుల్లి, ఉల్లి తిన్నతర్వాత కూడా నోటి దుర్వాసన వస్తుంది. %ఈ రెండు రకాల దుర్వాసనలకు గ్లిజరిన్ చెక్ పెట్టేస్తుంది. గోరువెచ్చని నీటిలో గ్లిజరిన్ (గ్లిజరాల్) కలిపి కాసేపు పుక్కిలిస్తే దుర్వాసన మాయమైపోతుందట. ఉల్లి, వెల్లుల్లిలో గంధకం (సల్ఫర్) సమ్మేళనాలు ఉంటాయి. ఈ సమ్మేళనాలు అమైనో ఆమ్లాలు, ఇతర ఆమ్లాలుగా మారతాయి. నోటి దుర్వాసన రావడానికి కారణం ఇవే. గ్లిజరిన్‌తో నోటిని తడపడం వల్ల నోట్లో బ్యాక్టీరియా పెరుగుదల ఆగిపోతుంది. చిగుళ్ల ఆరోగ్యం మెరుగవుతుంది. చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన



ఉంటే గ్లిజరిన్‌తో చేసిన మౌత్‌వాష్‌లు, టూత్‌పేస్టులు కూడా మార్కెట్లో ఉన్నాయి. అయితే, నోటి దుర్వాసన పోగొట్టే ప్రయత్నంలో గ్లిజరిన్ గొంతులోకి పోకుండా చూసుకోవాలి. లేదంటే వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, గొంతులో మంట వంటి సమస్యలు వస్తాయి.

# ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా



ర్షాల్లో తేమ, నీటి కాలుష్యం వల్ల బ్యాక్టీరియా, కీటకాలు తయారవుతా యి. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తుతాయి. వీటి బారిన పడకుండా ఇంట్లోనే చిన్న చిట్కాలతో బయటపడవచ్చు. అవేంటో చూద్దాం.తులసి : తులసిలో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. తులసి ఆకులను తినడం కానీ.. తులసి టీని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. ఇంకా ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది.అల్లం : అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లం టీ తీసుకోవడం లేదా ఆహారంలో అల్లం భాగం చేసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.వెల్లుల్లి : వెల్లుల్లిలో యాంటీమైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే అల్లిసిన్లో సమృద్ధిగా ఉంటుంది. పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం వంటలో భాగం చేసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చు. వెల్లుల్లితో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

వేప : వేపలో యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. వేప ఆకులు లేదా వేప ఆధారిత ఉత్పత్తులను తీసుకోవడం వల్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే మలేరియా, డెంగ్యూ, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉండవచ్చు.

# కార్యాచరణ కావాలి...!



రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు వేసవి ప్రణాళికను ప్రకటించింది. 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026' పేరుతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రూపొందించిన ఈ ప్రణాళికలో వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా చూడాలని అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకటించారు. ఈ దిశలో జిల్లాల కలెక్టర్లకు కొన్ని నిర్ధిష్ట సూచనలను కూడా ప్రణాళికలో పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోనే వేసవిని తలపించింది. ఈ నెల మొదటి వారంలోనే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా కావలిలో ఆరవ తేదీన 40డిగ్రీలు, ఒంగోలు, తిరుపతి, కర్నూలు, అమరావతి వంటి ప్రాంతాల్లో 38-39 డిగ్రీలు ఉష్ణోగ్రతలు చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో మరో రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అంటే, 42 నుండి 43 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకునే అవకాశం ఉందని అర్థం. మార్చి నెల ప్రథమార్థంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉంటే, ఏప్రిల్, మే నెలల్లో ఏ స్థాయికి చేరుతాయో అర్థం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా నెలకొంటున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుంటే రాష్ట్రంలో ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమై ఉండాలి. కానీ, అలా జరగలేదు. ఇప్పటికైనా ప్రణాళికను ఆవిష్కరించారు కనుక ఆ దిశలో ప్రభుత్వ అడుగులు వేగంగా పడాలి. వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు సిద్ధం చేయాలని, తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగాలని, మార్కెట్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని ప్రణాళికలో పేర్కొనడం మంచిదే! అయితే, ఇలాంటి ప్రణాళికలు గతంలోనూ ప్రకటించడం, అమలులో అనేక లోపాలు బయటపడటం విస్మరించకూడదు. ప్రణాళిల్లో పేర్కొన్న అంశాలు ఎలా ఉన్నప్పటికీ వాటి అమలుకు చాలినన్ని నిధులు అందుబాటులో ఉండకపోవడం గతంలో అనేక సందర్భాల్లో కీలకాంశంగా ముందుకు వచ్చింది. నిధుల కొరత కారణంగానే అనేక స్థానిక సంస్థలు తాగునీటిని కూడా సక్రమంగా సరఫరా చేయలేని ఉదాహరణలు కోకొల్లలు! ఆసుపత్రులలో బెడ్లు, మందుల పరిస్థితి కూడా ఇంతే! అందువల్ల నిధుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కష్టాలను ఎదుర్కోవడం కేవలం విపత్తు నిర్వహణ శాఖ బాధ్యత మాత్రమే కాదు. అనేక శాఖలు సమన్వయంతో దీనిని సాధించాలి. ఎండలు తీవ్రమౌతున్న నేపథ్యంలో పాఠశాలల సమయాలు మార్చడం వంటి అంశాలను ప్రభుత్వం తక్షణం పరిగణలోకి తీసుకోవాలి.వేసవి తీవ్రత పెరిగే కొద్దీ శ్రమ జీవుల కష్టాలు కూడా తీవ్రమవుతాయి. ఉపాధి హామీ పేదలు, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీల పై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మధ్యాహ్న సమయాల్లో పనిచేయాల్సి రావడం ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదంగా మారుతోంది. ప్రతి సంవత్సరం వడదెబ్బ బారిన పడుతున్న వారిలోనూ, ప్రాణాలు కోల్పోతున్న వారిలోనూ పెద్ద సంఖ్యలో ఉపాది హామీ కార్మికులు ఉండటం గమనార్హం. దీనిని పరిగణనలోకి తీసుకుని ఉపాధి పనుల వేళలను తక్షణమే మార్చాలి. అలాగే ఉపాధి పనులు జరిగే చోట తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు, షామియానాలు వంటి అవసరమైన ఇతర జాగ్రత్తలు తీసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులున్న ప్రతిచోటా ఈ తరహా చర్యలను చేపట్టాలి. మహిళా కార్మికులకోసం మరిన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో ఈ కష్టజీవులకు లభించిన స్థానం నామమాత్రమే! ప్రభుత్వం వీరి భద్రత కోసం మరింతగా దృష్టి సారించాల్సి ఉంది. వేసవి కాలంలో అగ్నిమాపక శాఖ ప్రాధాన్యతను, నగరాలు, పట్టణాల్లో హరిత వాతావరణాన్ని పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, మొక్కలు పెంచడం వంటి చర్యల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఏమైనప్పటికీ, ఈ తరహా చర్యలు కాగితాలకే పరిమితమైతే ఎటువంటి ప్రయోజనం లేదు. కార్యాచరణలో కనిపించినప్పుడే ప్రజలకు రక్షణ లభిస్తుంది.

# గిరిజనులకు అభివృద్ధి అందకుండ చేస్తారా?

**అక్కడి పనులను అడ్డుకోవడమేమిటి**

**అటవీ అధికారుల తీరుపై మండిపడ్డ బాబు**

**అమరావతి,తెలంగాణ దిశ :** ప్రభుత్వం ఆమోదించిన ఇళ్లకు కూడా ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వకపోవడమేంటని అటవీ అధికారులను సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గిరిజనులకు నీరు, రహదారి, విద్యుత్ వంటి కనీస సదుపాయాలు కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో ఫారెస్ట్ అధికారులపై చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. అభయారణ్యం పేరుతో అభివృద్ధి పనులు ఆపడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాలకు కూడా అడ్డంకులు సృష్టించడం తగదని పేర్కొన్నారు. పాపికొండల ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం, బోర్‌వెల్స్‌కు అనుమతులు ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న రహదారిపై గ్రావెల్ లేదా మెటల్ వేయడానికి అభ్యంతరం చెప్పడమేంటనీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అధికారుల వ్యవహార శైలిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయంటూ హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా మారాలని అన్నారు. సమస్యలు ఉంటే నేరుగా తనకు లేదా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తెలియజేయాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు కలెక్టర్, డీఎఫ్‌వో కలిసి ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని హుకుం జారీ చేశారు. అభివృద్ధి పనులు ఆగిపోకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.


# శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఆ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లో ఇబ్బడిముబ్బడిగా కారెక్కేస్తున్నారు. అధికార కాంగ్రెస్ నుంచి మొదలు బీజేపీ వరకు అన్ని పార్టీల నుంచి గులాబీ కండువా కప్పుకుంటు న్నారు. దీంతో ఆ సెగ్మెంట్‌లో కారు ఓవర్ లోడ్ అయ్యిందన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరిపోవడంతో ఇప్పుడు వచ్చిన వాళ్లంతా టికెట్‌పై ఆశలు పెట్టుకుంటున్నారట.జంపింగ్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది బీఆర్ఎస్ హైకమాండ్. లీడర్లతో పాటు క్యాడర్‌ను బలోపేతం చేసుకునే పనిలో పడింది.ఈ క్రమంలోఇతరపార్టీల నుంచి వచ్చిన నాయకులను, కార్యకర్తలను భారీగా పార్టీలో చేర్చుకుంటోంది గులాబీ పార్టీ. గ్రేటర్ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గంపై అయితే కారు పార్టీ ఇంకింత కాన్సంట్రేషన్ పెడుతోంది. కారు పార్టీ గుర్తుపై గెలిచిన అరికెపూడి గాంధీ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడంతో అక్కడ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ అధిష్టానం ప్రత్యేకంగా దృష్టి సారించింది.శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ ఇంచార్జ్ బాధ్యతలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అప్పగించింది అధిష్టానం. మాధవరం తన నియోజకవర్గం కూకట్‌పల్లి అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే..ఇంచార్జ్‌గా ఉన్న శేరిలింగంపల్లిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలను భారీగా బీఆర్ఎస్ పార్టీలోకి తీసుకొస్తూ..వరుసగా జాయినింగ్‌లు చేపిస్తున్నారు. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో లేనన్ని చేరికలు బీఆర్ఎస్‌లో జరుగుతున్నాయన్న చర్చ ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా..ఇప్పటికే పార్టీలో ఉన్న వాళ్లు, కొత్తగా పార్టీలో చేరుతున్న వాళ్లు పెరిగిపోవడంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొందన్న టాక్ వినిపిస్తోంది. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌లో ఉన్న నేతలు, క్యాడర్‌కు కొత్తగా పార్టీలోకి వచ్చిన వాళ్లతో సమన్వయం కొరవడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే టికెట్ ఆశించే వాళ్లు అంతకంతకు పెరిగిపోతున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు పార్టీలో చేరిన నేతలంతా టికెట్ ఆశల్లో భాగంగానే గులాబీ కండువా కప్పుకున్నట్లు ఇన్ సైడ్ టాక్ నడుస్తోంది. అయితే ఎన్నిక ఏదైనా శేరిలింగంపల్లిలో గెలుపు



బీఆర్ఎస్‌దే అనే ఊపు ఉండేది. మళ్లీ అలాంటి జోష్ రావాలంటే నియోజకవర్గానికి పూర్తిస్థాయి ఇంచార్జ్‌ను నియమించాలన్న డిమాండ్స్ పార్టీలో వ్యక్తమవుతున్నాయట. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవలే బీజేపీని వీడి కారెక్కిన మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి నివాసానికి వెళ్లడంతో బీఆర్ఎస్ పార్టీలో శేరిలింగంపల్లి నియోజకవర్గంపై జోరుగా చర్చ మొదలైంది.నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన ఆమెకు పార్టీ అంత ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందని ఆరా తీస్తున్నారట నేతలు. పార్టీలో ముందు నుంచి ఉన్న వారి సంగతేంటన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. మాజీ కార్పొరేటర్, నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు సాయిబాబ తనకు ఇంచార్జ్‌గా బాధ్యతలు ఇస్తారని ఆశలు పెట్టుకున్నారు. పార్టీలో మొదటి నుంచి ఉన్న తనకు అవకాశం వస్తుందని ఆయన భావిస్తున్నారు.మరోవైపు తెలంగాణ ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ ఇచ్చే కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ఉంటారన్న అభిప్రాయాలున్నాయి. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీలో పని చేస్తున్న చిర్రా రవీందర్ యాదవ్ కూడా టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. మాజీ కార్పొరేటర్లు నవతా రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి ఎమ్మెల్యే టికెట్ తమకే వస్తుందని చెప్పుకుంటున్నారట. దీంతో తమను నియోజకవర్గంలో నడిపించే నాయకుడు ఎవరనేది తెలియక బీఆర్ఎస్ క్యాడర్ అయోమయంలో ఉందట. బీఆర్ఎస్ అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తుందో? మిగతా ఆశావహులను ఎక్కడ అడ్జస్ట్ చేస్తారో చూడాలి.

# కొవ్వూరు -జీలుగుమిల్లి మధ్య 368 కోట్లతో హైవే



కాకినాడ,తెలంగాణ దిశ :తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు- ఏలూరు జిల్లా లోని జీలుగుమిల్లి మధ్య 86.7 కిమీ ల హైవే కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రం. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు మాజీ కేంద్రమంత్రి దగ్గుపాటి పురంధ్రీశ్వరి ఈ వివరాలు తెలిపారు. మొత్తం 368కోట్ల రూపాయలతో నిర్మించే ఈ డబుల్ లైన్ హైవే ఏజెన్సీ గ్రామాలకూ, పోలవరం ప్రాజెక్ట్ కూ చాలా రకాలుగా ఉపయోగపడనున్నట్టు ఆమె ప్రకటించారు.ఆల్రెడీ కొవ్వూరు నుండి గోదావరి గట్టు వెంబడి పోలవరం వరకూ ఒకరోడ్డు, పోలవరం నుండి జీలుగుమిల్లి వరకూ మరొక రోడ్డు ఉన్నాయి. అయితే ఇవి సింగిల్ లైన్ రోడ్లు. రవాణా సౌకర్యం కూడా తక్కువే. ఇప్పుడు ఆ రెండు రోడ్లనూ కలుపుతూ ఓకే రోడ్డు క్రింద మార్చబోతున్నారు.మొత్తం 86.7 కిమీ పొడవైన ఈ రోడ్డు కొవ్వూరు లోని గోదావరి మాత విగ్రహం నుండి మొదలై గోదావరి పై నిర్మించిన గామన్ బ్రిడ్జ్ క్రింద నుండి పట్టిసీమ,పోలవరం మీదుగా జీలుగుమిల్లి వరకూ వెళుతుంది. ఈ రూట్ లో 30 మైదాన గ్రామాలు, 100 ఏజెన్సీ గ్రామాలు కవర్ అవుతాయి.ఆయా ప్రాంతాల స్టూడెంట్స్, ఉద్యోగులు, చిన్నకారు వ్యాపారస్తులు, వ్యవసాయ దారులకు ఈరోడ్డు మెరుగైన ట్రాన్స్ పోర్ట్ సౌకర్యం కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. క్రొత్త గా వచ్చే ఈ హైవే వలన హైదరాబాద్ -విశాఖపట్నం మధ్య మరింత దూరం తగ్గనుంది. ఈ హైవే పూర్తి అయితే ఆల్రెడీ నిర్మాణం చివరి దశ లో ఉన్న ఖమ్మం -దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే కి మరొక ప్రత్యామ్నాయం వచ్చినట్టే అవుతుంది. పోలవరం మీదుగా 2 లేన్లతో అనుమతికొవ్వూరు -జీలుగుమిల్లి రెండు వరుసలు హైవే చాలా టూరిస్ట్ ప్రాంతాలను కవర్ చేస్తూ వెళుతుంది. వాటిలో 200ల సినిమా షూటింగ్ లు జరుపుకున్న సినిమా చెట్టు ఉండే కుమారదేవం, పట్టిసీమ ప్రాజెక్టు, పట్టిసీమ టెంపుల్, పోలవరం ప్రాజెక్టు లతో పాటు పోలవరం -జీలుగుమిల్లి మధ్య ఉన్న ఏజెన్సీ (అటవీ ప్రాంతాలు ) గ్రామాలు ఉన్నాయి.

ఈ హైవే వల్ల ట్రాన్స్ పోర్ట్ తో పాటు టూరిజం కూడా డెవలప్ అవుతుంది అని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ హైవే పూర్తి అయితే ఇది పోలవరం ప్రాంతాల అభివృద్ధి కి గేమ్ చేంజర్ అవుతుందని అక్కడి ప్రజలు అంటున్నారు.ఖమ్మం నుండి దేవరపల్లి మధ్య రెడీ అవుతోన్న గ్రీన్ ఫీల్డ్ హైవే కొవ్వూరు కి 20కిమీ దూరం లోనే ఉండబోతోంది. అదిగాక చెన్నై -హౌరా నేషనల్ హైవే కూడా కొవ్వూరు పై నుండే వెళుతోంది. వీటి జతకి క్రొత్తగా కొవ్వూరు -జీలుగుమిల్లి హైవే కూడా శాంక్షన్ కావడం తో కొవ్వూరు అభివృద్ధి స్కై రేకెట్ వేగంతో ముందుకి వెళుతుంది అని అక్కడి ప్రజలు అంటున్నారు.

# రైతులను బలహీనం చేసేలా చట్టాలు

**కౌలు రైతులను విస్మరిస్తున్న పాలకులు**

**వ్యవసాయరంగం మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు**

**అమరావతి,తెలంగాణ దిశ :** పేద రైతు, కౌలు రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని చట్టాల ద్వారా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మార్గం సిద్ధం చేస్తున్నారనేది స్పష్టంగా తెలుస్తుంది. వ్యవసాయ సంక్షోభం, యువరైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయేగాని తరగడం లేదు. అందుకుగల కారణాలను, పరిష్కారాలను కనిపెట్టడంలో ప్రభుత్వం వైపు నుండి వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చంద్రబాబు నాయుడు రాష్ట్ర అసెంబ్లీలో 'డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్' పత్రాన్ని ప్రవేశ పెట్టినప్పుడు కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు. స్వర్ణాంధ్ర 2047 సాధించే సమయానికి వ్యవసాయరంగంపై ఆధారపడే జనాభా 60 శాతం నుండి 10 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు. నేడున్న వ్యవసాయ భూములు కూడా 30 శాతం చాలవని అంటున్నారు.. మిగతాది అవసరం లేదన్న ధోరణి కనిపిస్తోంది. అంటే ఆ భూములను ఎవరికైనా అమ్ముకోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో మిగిలిపోయే మిగతా 50 శాతం జనాభాను పట్టణాలకు తరలించి వారిని చీప్ లేబర్‌గా వాడుకోవచ్చన్న దుర్మార్గ ఆలోచన కూడా ఇందులో ఇమిడి ఉంది. కేంద్ర ప్రభుత్వం సైతం ఈ సంవత్సరం 100 లక్షల ఎకరాలను అమ్మకానికి సిద్ధం చేసింది. నూతన నీటి విధానం' ప్రకారం కాలువలకు, పొలాలకు మీటర్లు పెట్టి నీటి వాడకాన్నిబట్టి రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తారు. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి కంపెనీల నుంచి పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఈ విధానం పేద రైతులకు వ్యతిరేకమైనదిగా గుర్తించాలి. అప్పుడు సాగునీరు చాలా ఖరీదైనదిగా మారుతుంది. ఇకపోతే విత్తన బిల్లు 2025' చూస్తే రైతులకు ఆందోళన కలుగుతుంది. విద్యుత్ సవరణ చట్టం 2025' ప్రకారం మొత్తం విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రధానాంశం. ఐదు సంవత్సరాలలో క్రాస్ సబ్సిడీని రద్దు చేయాలనేది మరో కీలకాంశం. ఇది మెట్ట ప్రాంతాలలో, గిరిజన ఏరియాలో, వెనుకబడ్డ ప్రాంతాలలో చిన్న రైతుల పంపుసెట్లు, లిఫ్ట్‌ల వ్యవసాయాన్ని బాగా దెబ్బతీస్తుంది. ఎరువుల విధానం 2025' ప్రకారం ఎరువులపై ప్రభుత్వ నియంత్రణ తొలగించారు. సకాలంలో రైతులకు అందక పోయినా, ఉండాల్సిన నాణ్యత లేకపోయినా, ధర పద్ధతులలో తేడాలున్నా ప్రభుత్వ యంత్రాంగానికి బాధ్యత లేదు. ఇప్పుడు ఈ విధానంలో అదనంగా నానో లిక్విడ్ యూరియాను ప్రవేశ పెట్టింది. దాంట్లో నత్రజని 45 శాతం నుంచి 4 శాతానికి తగ్గుతుంది. యూరియాపై ప్రభుత్వ సబ్సిడీ మొత్తం తగ్గించి నగదు బదిలీ పథకం పెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరుతోంది. నానో యూరియా తీసుకున్న రాష్ట్రంలో బస్తాకు రూ.800 సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రకృతి విపత్తుల చట్టం 25, సెక్షన్ 12లో బాధితులను ఆదుకోవడానికి వున్న సూచనలు తొలగించారు. సెక్షన్ 13లో పంటలు కోల్పోయిన రైతులకు చెందిన రుణాలు వాయిదా వేసి తిరిగి పంట రుణాలు రీషెడ్యూల్ చేసే చాప్టర్‌ను తొలగించారు. ఇరవై నెలల్లో ఇన్ని చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి గుండెకాయ లాంటి కౌలు రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు అందించే చట్టం చేయకపోవడం దారుణం.

# డిఫెన్స్ రంగంలో సరికొత్త అధ్యాయం



**- జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు**

**- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్**

**- తొలిదశలో 45కోట్ల పెట్టుబడులు..750మందికి ఉపాధి**

**- ప్రాజెక్టుకు శంకుస్థాపనపై మంత్రి నారాయణ హర్షం**

నెల్లూరు,తెలంగాణ దిశ : ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు రక్షణ , తయారీ రంగాల్లోనూ ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో నెల్లూరు జిల్లాలో ఒక భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డుకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు కావడం విశేషం. ఈ ప్రాజెక్టు ద్వారా రక్షణ రంగానికి అవసరమైన అత్యాధునిక నౌకల నిర్మాణం ఇక్కడ జరగనుంది. సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్ పరిశ్రమ ఏపీకి వస్తున్నందుకు ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దీంతో స్థానిక మత్స్యకారుల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు. ఈ పరిశ్రమ వల్ల 25 వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని చెప్పారు. మత్స్యకార కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. సుదీర్ఘ సముద్ర తీరం ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. జువ్వలదిన్నెలో అటానమస్ మారిటైమ్ షిప్‌యార్డును సాగర్ డిఫెన్స్ అభివృద్ధి చేయనుంది. మొదటి దశలో రూ.45 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 750 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ముంబయి కేంద్రంగా పనిచేసే సాగర్ డిఫెన్స్ సంస్థ.. అన్‌మాన్డ్ మెరైన్ సర్ఫేస్ వెహికల్స్ రంగంలోనూ పనిచేస్తోంది. ఇప్పటికే దేశ నౌకాదళం, ఐడెక్స్ (ఐడీఈఎక్స్), ఇతర భద్రతా సంస్థలతో పని చేస్తోంది. ఇక్కడ ఇంటెలిజెన్స్ మారిటైం సిస్టమ్స్, సెన్సార్లు, కమాండ్ కంట్రోల్ టెక్నాలజీలను అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తులో ఆధునిక నౌకా దళ కార్యకలాపాలకు ఈ షిప్‌యార్డు కీలకం కానుంది. మానవరహిత నౌకలు , అత్యాధునిక సాంకేతికతతో కూడిన యుద్ధ నౌకల తయారీకి ఈ కేంద్రం చిరునామాగా మారబోతోంది. ఏపీని కేవలం ఐటీ రంగంలోనే కాకుండా.. తయారీ, రక్షణ రంగాల్లో కూడా దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసి.. ప్రపంచ స్థాయి నౌకల తయారీని ఇక్కడి నుంచే ప్రారంభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జువ్వలదిన్నె పోర్ట్ ఆధారంగా ఈ ప్రాంతం రానున్న రోజుల్లో భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. నెల్లూరు జిల్లాలో సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయడం గర్వకారణమని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే మొదటి కేంద్రంగా రూపుదిద్దుకోబోతున్న ఈ ప్రాజెక్టు భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. గురువారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టు సముద్ర సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తూ, మత్స్యకార రంగం, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి ఊతమివ్వనుందని తెలిపారు. తీర ప్రాంత పర్యవేక్షణ, భద్రత, రక్షణ సిద్ధతను మరింత బలపరచడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును నెల్లూరు జిల్లా జువ్వలదిన్నేకు తీసుకురావటంలో కృషి చేసిన మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు.

# మినరల్ కాదు.. జనరల్ మాత్రమే

**ఆసిఫాబాద్,తెలంగాణ దిశ :** జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌తో పాటు కాగజ్ నగర్ రెండు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. "ప్యూరి పై వాటర్" వంటి పేర్లతో సాధారణ నీటిని మినరల్ వాటర్ అని ప్రజలకు సరఫరా చేసి మోసం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్లను నిర్వహించినా, సంబంధిత అధికారులు దీనిపై పట్టించుకోవట్లేదు. జిల్లాలో దాదాపు 80కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నప్పటికీ, వాటిలో కొన్నింటికి మాత్రమే ఎస్ఎస్ఐ, ఐఎస్ఐ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. మిగతా ప్లాంట్లు రోజు వేల లీటర్ల నీటిని విక్రయించి లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. ఈ నీటిని తాగిన వారికి అనేక ఆరోగ్య సమస్యలు రావడం సాధారణం అయింది.

మినరల్ మాటున దందా...: మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ యాజమాన్యాలు నీటిని శుద్ధి చేయకుండానే క్యాన్లలో నింపి లాభం పొందుతున్నారు. నీటిని నిల్వ చేసే ట్యాంక్‌లను నెలల తరబడి శుభ్రం చేయకపోవడం, నాణ్యతకు హానికరంగా మారింది. నీటిని శుద్ధి చేసిన తర్వాత నిబంధనల ప్రకారం క్యాన్ల పై తేదీ వివరాలను స్టిక్కర్ చేయాలి. కానీ ప్లాంట్ యాజమాన్యాలు ఈ నియమాన్ని పాటించడం లేదు. కనీసం ప్లాంట్ వద్ద అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్ ఉండి, రోజూ నీటిని పరీక్షించి కాలుష్యం, మెగ్నీషియం మోతాదులు పరీక్షించిన తర్వాత మాత్రమే నీటిని సరఫరా చేయాలి. కానీ కొందరు అపరిశుభ్రమైన నల్లాల ద్వారా వచ్చే నీటిలో రసాయనాలు కలిపి, ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు...: వాటర్ ప్లాంట్లు ఐఎస్ఐ అనుమతి పొందాలంటే 1 లక్ష వరకు ప్రభుత్వానికి చెల్లించాలి. ప్రతి నెల పర్యవేక్షణ కొరకు 10,000, సంవత్సరానికి ఒక్కసారి రెన్యువల్ కోసం 50,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని చెల్లించకుండా, ప్లాంట్ నిర్వాహకులు సంబంధిత శాఖలోని కొంతమంది అధికారులకు ముడుపులు చెల్లించి, ఇష్టానుసారం నీటిని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూలు మత్తులో పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నాయకులు అధికారులు వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని కోరుతున్నారు.

# స్మారక నాణేల సేకరణ హాబీగా..





ఒక్కొక్కరికి ఒక్కో అలవాటు ఉంటుంది. అది ప్రత్యేక హాబీగా రూపొందితే– ఆ వ్యక్తికి కూడా గుర్తింపు తెచ్చి పెడుతుంది. కొందరికి స్టాంపులు.. ఇంకొకరికి నాణేలు... మరికొందరికి అరుదైన వస్తువుల సేకరణ .. గార్డెనింగ్.. సూక్ష్మకళలు హాబీలుగా ఉంటాయి. అరుదైన స్మారక నాణేల సేకరణ హాబీగా పెట్టుకున్నారు కోడూరి నాగ సూర్య రాఘవేంద్రబాబు. అనేకమంది ప్రముఖుల స్మారకంగా విడుదల అయిన నాణేలను సేకరించారు. అవి చరిత్రను చెబుతాయి. ఆయా వ్యక్తుల ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గ్రామానికి చెందిన కోడూరి ప్రసాద్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు మే 26, 1999లో జన్మించారు. స్టాంపుల సేకరించిన ప్రముఖుల గురించి వార్తా పత్రికల్లో చూసి చిన్నప్పుడే తను కూడా ఏదో ఒకటి చేసి గుర్తింపు తెచ్చుకోవాలని భావించారు. అరుదైన నాణేలను సేకరించటంపై ఆసక్తి పెంచుకున్నాడు. తన పదో ఏట నుంచే దీనిని ప్రారంభించాడు. బిటెక్ తర్వాత ఎంబిఏ హెచ్‌ఆర్ విభాగంలో పూర్తిచేసిన ఆయన గత 15 సంవత్సరాలుగా స్టాంపులు, నాణేలు, అరుదైన వస్తువుల సేకరణ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వద్ద మనదేశానికి సంబంధించి ఆర్‌బిఐ ముద్రించిన పలు నాణేలు ఉన్నాయి. పాత నాణేలను సేకరించటం ఆయనకు ఫ్యాషన్. ఇప్పటివరకూ 200కుపైగానే కాయిన్స్ సేకరించి భద్రపర్చారు.

అరుదైనవి.. అలవోకగా...: మన దేశంలో మొదటిసారిగా మొఘల్ చక్రవర్తి అక్బర్ హయాంలో స్మారక నాణేలా విడుదల ప్రారంభమైంది. స్వాతంత్ర్యం అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశస్థాయిలో ముఖ్యమైన సంఘటనలు, ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన స్మారక కాయిన్స్ విడుదల చేస్తోంది. అలా విడుదల చేసిన వాటిలోనూ, తను సేకరించిన కాయిన్స్ ఉన్నాయి. వాటిలో జాతిపిత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, తత్వవేత్త ఓషో పేరిట స్మారక నాణేలు ఉన్నాయి. 80 ఏళ్ల కామన్‌వెల్త్ గేమ్స్, ఇండియన్ రైల్వేస్, మదర్ థెరిస్సా, మదర్స్‌హెల్త్, రవీంద్రనాథ్ ఠాగూర్, సుప్రీంకోర్టు, మోతీలాల్ నెహ్రూ, మహారాణా ప్రతాప్, జగత్‌గురు నారాయణ, బయోడైవర్సిటీ, ఇన్‌కంటాక్స్, చైల్డ్‌హెల్త్, డైమండ్‌జూబ్లీ, 60 ఏళ్ల పార్లమెంట్, కూకామూవెంట్, బ్యాంక్ నగర (మలేషియా), ఆచార్య తులసి, బాబూ రాజేంద్రప్రసాద్, భగత్‌సింగ్, లూయిస్ బ్రెయిలీ, ఐఎల్ఒ, ఒఎన్‌జిసి, ఢిల్లీ కామన్‌వెల్త్‌గేమ్స్ వంటి అంశాలకు సంబంధించిన కాయిన్స్‌ను సేకరించారు. మనదేశంతోపాటుగా విదేశాలకు చెందిన కాయిన్స్‌ను కూడా కొన్నింటిని సేకరించారు.

భావితరాల కోసం...: ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం అంటూ డిజిటల్ కరెన్సీకి అలవాటు పడిపోయాం. నాణేలు, కరెన్సీ వాడకం చాలావరకూ తగ్గిపోయింది. భావితరాలకు గతకాలపు నాటి నాణేలు గురించి తెలిసే అవకాశం చాలా తక్కువ. అందుకే భావితరాలకు తనవంతుగా కొంతమేరకైనా పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి పురాతనకాలం నాటి అరుదైన నాణేలను సేకరించి భద్రపర్చటం, వాటిని ప్రదర్శించటం ద్వారా భావితరాలకు తెలియ జేయటానికి ఆయన కృషిచేస్తున్నారు. నాణేల రారాజుగా ఆయన్ను కొందరు పిలుస్తుంటారు. రాజుల కాలం నాటి నాణేలు, బ్రిటీషు వారు రూపొందించిన స్మారక చిహ్నాలు వంటివి కూడా కొన్ని ఉన్నాయి. మనం విడిచిపెట్టిన పైసలే కాదు, బేడ, దమ్మిడి, కాసులు ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి. వివిధ సంవత్సరా ల్లో జారీ చేసిన స్వాతంత్ర్య సమరయోధుల నాణేలు ఆయన వద్ద అబ్బుర పరుస్తాయి. సిఎం నారా చంద్రబాబు నాయుడుతోపాటుగా పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, కలెక్టర్లు ఇతడి కృషిని అభినందించారంటే ఆశ్చర్యం కలుగక మానదు. అనేక అరుదైన నాణేలను సేకరిస్తూ ఆయన పలువురి చేత శభాష్ అనిపించుకున్నారు.

పురాతన, చారిత్రక అంశాలు తెలిపేలా...: పురాతన, అరుదైన, విదేశీ నాణేలతో చరిత్ర, సంస్కృతిని తెలుసుకోవచ్చు.శతాబ్దాలనాటి నాణేలతో ఆయా కాలాల గురించి కొంతైనా మననం చేసు కోవచ్చు. నిజాం, బ్రిటీష్ కాలం నాటి పైసలు, నాణేలు అరుదుగా దొరుకుతాయి.

చాప్లిస్లపైనా మైక్రోఆర్ట్ చిత్రీకరణలు: నాణేల సేకరణ ఒక ఎత్తయితే వాటిని భద్రపర్చటం ఇంకో ఎత్తు. చాప్లిస్లపై పెన్సిళ్లతోనూ, పెన్నుతోనూ పలు ప్రభుత్వ పథకాలు గురించి రాసి సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా ప్రముఖులకు అందజేయటం అతడికి అలవాటుగా మారింది. స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతులు, జయంతుల సందర్భంగా సభలకు హాజరయ్యే అతిథులను కలిసి అందజేస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రిపబ్లిక్‌డే వేడుకల్లో ఆయన జిల్లాకలెక్టర్‌ను కలిసి చాప్లిస్‌పై రాసినది ఇచ్చారు. 2019లో అప్పటి సిఎం నారా చంద్రబాబు నాయుడు పేరును చాప్లిస్‌పై రాసి ఇవ్వగా ఆయన ఎంతో సంతోషించారు. పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా గతంలో అప్పటి జెఎన్‌టియు విసి మాజీ గొట్టుముక్కల ప్రసాద్ రాజుకు జాతీయజెండా ప్రతిరూపాన్ని తీర్చిదిద్ది ఇచ్చారు.

సామాజిక సేవల్లోనూ..: 2022లో ఆయనతోపాటుగా తీపర్రు గ్రామానికి చెందిన స్నేహితులు బాలాజీ, సత్యనారాయణ, వంశీ, సురేష్, సుభాష్‌లతో కలిసి అబ్దుల్ కలాం సేవా సమితిని ఏర్పాటుచేశారు. పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలతోపాటుగా గ్రామంలో స్వచ్ఛభారత్ వంటి కారక్రమాలను గ్రామస్తులతో కలిపి నిర్వహిస్తున్నారు. సమీపంలోని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు పండుగలు, ప్రముఖ జాతీయ నాయకుల వర్ధంతులు, జయంతుల సందర్భంగానూ, స్వాతంత్ర్య దినోత్సవం, భారత రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా పిల్లలకు పండ్లు, పెన్సిళ్లు, స్కేళ్లు, అల్పాహారాలు వంటివి కూడా అందజేస్తున్నారు.

భావితరాల కోసమే...: భావితరాలకు మన కరెన్సీని విషయాలను అప్పటి చారిత్రక విషయాలను తెలియజేసేందుకు నేను కాయిన్స్ సేకరిస్తున్నా. సేకరించిన వాటిని ఎగ్జిబిషన్ల ద్వారా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా. కొన్నేళ్లుగా ఈ కృషిని కొనసాగిస్తున్నా. ఈ సేకరణతో నేటి తరానికి చరిత్రను తెలియజేస్తున్నాం. 2019లో సిఎం చంద్రబాబు నాయుడును కలిశాను. ఆయన అభినందించారు. నాకు మంచి భవిష్యత్తు చూపిస్తానని చెప్పారు.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

హైదరాబాద్,తెలంగాణ దిశ : పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.

ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను సర్కార్ రూపొందించనుంది. పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను సైతం ఎంపిక చేసింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ పద్ధతిలో పేదలు, మధ్యతరగతి వారికి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ ఫోర్త్ సిటీలోనూ పెద్దఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ తక్కువ ఆదాయ, మధ్య తరగతి పరిధిలోకి వచ్చే జనాభా ఎక్కువగా ఉంటున్నారు. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగిపోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించి అల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

# భారీగా సోలార్ ఉత్పత్తికి సింగరేణి ప్రణాళికలు

**అదిలాబాద్,తెలంగాణ దిశ :** పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సింగరేణి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కార్మికుల నివాస గృహాలపై రూఫ్ టాప్ సౌర ఫలకాలను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. సుమారు రూ. 65 కోట్ల వ్యయంతో 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సంస్థపై ప్రతి నెలా పడుతున్న రూ. 50-60 కోట్ల విద్యుత్ బిల్లుల భారం కొంత మేర తగ్గనుంది.సింగరేణి సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా సింగరేణి ఏరియాల్లోని కార్మికుల నివాస గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసి విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అనువైన నివాస గృహాలను గుర్తించేందుకు ఆరు నెలల క్రితమే సింగరేణి అధికారులు సర్వే నిర్వహించారు. ఎక్కడైతే చెట్లు, నీళ్ల ట్యాంకులు లేకుండా ఖాళీగా నివాస గృహాలు ఉన్నాయో.. వాటిపై ఈ ప్యానళ్లు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు



సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యం గతేడాది డిసెంబర్‌లో ఓ సంస్థతో అగ్రిమెంట్ సైతం కుదుర్చుకుంది. పదేళ్లపాటు ఈ సంస్థనే కార్మికుల ఇళ్లపై సోలార్ నిర్వహణ బాధ్యత చేపట్టనుంది.సింగరేణి క్వార్టర్లలో కార్మికుల గృహ విద్యుత్తు వినియోగానికి ప్రస్తుతం నెలకు సుమారుగా రూ.50 నుంచి 60 కోట్ల మేర చెల్లిస్తోంది. రూఫ్ టాప్ సౌర విద్యుత్తుతో సింగరేణికి ఆ భారం చాలా వరకు తగ్గనుంది. అన్ని ఏరియాల వ్యాప్తంగా 15 వేల కిలోవాట్ల మేర సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంస్థ టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందు కోసం రూ.65 కోట్ల ఖర్చు చేయనుంది. ఉద్యోగుల గృహాలకు వినియోగించగా మిగిలిన మొత్తాన్ని గ్రిడ్‌కి అనుసంధానించనున్నారు. ఈ మేరకు 800 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తే లక్ష్యంగా ఇప్పటికే పలు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లా?ంట్ల ద్వారా ప్రస్తుతానికి 500 మెగావాట్ల వరకు లక్ష్యాన్ని సాధించింది. రూఫ్‌టాప్ సౌర విద్యుత్తు పనులు త్వరలో ప్రారంభం అవుతాయని మణుగూరు వర్క్‌షాపు డీజీఎం శ్రీకాంత్ తెలిపారు. సౌర ఫలకలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని అన్నారు.కాగా, సింగరేణి సంస్థ చేపట్టిన ఈ రూఫ్ టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా.. ప్రతి నెలా కార్మికుల గృహ విద్యుత్ వినియోగం కోసం సంస్థ వెచ్చిస్తున్న రూ. 50 నుంచి 60 కోట్ల భారం గణనీయంగా తగ్గుతుందని చెబుతున్నారు. 15 వేల కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా సంస్థకు దీర్ఘకాలికంగా ఆర్థిక పొదుపు చేకూరుతుందని అంటున్నారు. పర్యావరణ పరంగా చూస్తే.. బొగ్గు ఆధారిత విద్యుత్తుపై ఆధారపడటం తగ్గి, కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని..ఇది గ్రీన్ ఎనర్జీ లక్ష్యానికి దోహదపడుతుందని వెల్లడిస్తున్నారు. గృహ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా అదనపు శక్తి వనరుగా మారుతుందని చెబుతున్నారు. ఇది సంస్థ ఆర్థికాభివృద్ధికే కాకుండా.. సింగరేణిని పర్యావరణ హితమైన తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని అంటున్నారు.



# ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఎప్ స్టీన్ ఫైల్స్

జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారులు, రాజకీయ నాయకులు, దేశాల అధ్యక్షులు, కంపెనీల అధినేతలు వణికిపోతున్నారు. ఎప్‌స్టీన్ కేసు మళ్లీ ప్రపంచాన్ని కుదిపేస్తోంది. గతంలోనే అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసిన ఈ వ్యవహారం.. ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వస్తున్న ఫైల్స్‌తో మరోసారి ప్రభావం చూపుతోంది. ప్రముఖ వ్యాపార, విద్యా, రాజకీయ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు బయటకు రావడం, ఆ తర్వాత రాజీనామాల పరంపర మొదలవడం.. ఇది సాధారణ పరిణామం కాదు. ప్రపంచ స్థాయి సంస్థల విశ్వసనీయత, నైతిక ప్రమాణాలపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తే పరిణామంగా ఇది మారింది. ఈ సందర్భంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూ ఈ ఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే రాజీనామా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక విధానాలను ప్రభావితం చేసే ప్రముఖ వేదికకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి.. ఇలాంటి ఆరోపణల నడుమ తప్పుకోవడం సంస్థపై నేరుగా ప్రభావం చూపే అంశం. అమెరికా న్యాయ శాఖ విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బ్రెండే పేరు ప్రస్తావించబడడం.. ఆయన ఎప్‌స్టీన్‌తో భేటీ అయినట్లు ఆధారాలు బయటపడడం ఈ పరిణామానికి కారణమయ్యాయి. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలోనే ఆయన రాజీనామా చేయడం.. నైతిక బాధ్యతగా భావించవచ్చు. అయితే తన రాజీనామా లేఖలో ఈ అంశాన్ని నేరుగా ప్రస్తావించకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కథ కాదు. హార్వర్డ్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ గ్రహీత రిచర్డ్ ఆక్సెల్, గోల్డ్‌మన్ శాక్స్ లీగల్ ఆఫీసర్ క్యాథీ రూమ్లెర్, హయత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్, డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ , నార్వే అంబాసిడర్ మోనా వంటి ప్రముఖులు కూడా ఈ వివాదంతో తమ పదవులను వదులుకోవడం.. ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారుల వరకు విస్తరించిన ఈ సంబంధాల నెట్‌వర్క్, అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకు కారణమవుతోంద ఈ పరిణామాల వల్ల ప్రధానంగా మూడు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. మొదటిది ప్రపంచ ఎలైట్ వర్గాల మధ్య ఉన్న సంబంధాల స్వభావం. రెండవది నైతిక బాధ్యత అనే అంశం. మూడవది సంస్థల పారదర్శకతపై ఉన్న నమ్మకం. ఎవరైనా చట్టపరంగా తప్పు చేశారనే విషయం నిరూపించబడకపోయినా.. ప్రజా విశ్వాసాన్ని కాపాడుకోవడానికి నాయకులు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం.. నేటి ప్రపంచంలో నైతిక ప్రమాణాలు ఎంత కీలకమో చూపిస్తోంది. ప్రత్యేకంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వంటి సంస్థల విషయంలో ఈ అంశం మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే వేదికగా ఉన్న ఈ సంస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలి. అందుకే ఏ చిన్న వివాదం కూడా పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది. బ్రెండే స్థానంలో తాత్కాలికంగా అలోయిస్ జ్వింగీ బాధ్యతలు చేపట్టడం, సంస్థ కొనసాగింపుకు అవసరమైన చర్యగా కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా సంస్థ ప్రతిష్టను పునరుద్ధరించడం పెద్ద సవాలుగా మారింది. అదే సమయంలో ఈ ఫైల్స్ విడుదలలో పారదర్శకత ఎంత వరకు ఉందనే ప్రశ్న కూడా లేవనెత్తబడుతోంది. దర్యాప్తు వివరాలు పూర్తిగా బయటకు రాకపోవడం.. సమాచారం గోప్యంగా ఉంచడం ఇవి మరోవైపు అనుమానాలను పెంచే అంశాలు. ప్రజలకు పూర్తి నిజాలు తెలియజేయకపోతే, ఊహాగానాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. మొత్తం మీద ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం ఒక వ్యక్తి లేదా కొన్ని రాజీనామాలకే పరిమితం కాదు. ఇది ప్రపంచ ఎలైట్ వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్న సంఘటనగా చూడాలి. సంస్థల విశ్వసనీయత, నాయకుల నైతిక బాధ్యత, పారదర్శకత ఈ మూడు అంశాలు భవిష్యత్తులో మరింత కఠినంగా పరీక్షించబడే అవకాశం ఉంది. ఈ పరిణామాలు గ్లోబల్ స్థాయిలో పరిపాలనా విధానాలపై, నాయకత్వ ప్రమాణాలపై కొత్త చర్చలకు దారి తీస్తున్నాయి.ఎప్పుడు ఎవరి బాగోతం బయట పడుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఇప్పటికే తప్పు అంగీకరించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కూడా ఇందులో ఉన్నాడు. అయితే తాజాగా బయటపడిన ఈ ఫైల్స్ కారణంగా పలు కంపెనీల దిగ్గజాలు కూడా ఉన్నారు. వీరు రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సీఈవో బోర్జ్ బ్రెండే తన పదవికి రాజీనామా చేశారు, దవోస్ సమ్మిట్‌ల సంస్థకు ఇది భారీ దెబ్బ. హార్వర్డ్ యూనివర్సిటీ మాజీ అధ్యక్షుడు లారెన్స్ సమ్మర్స్, నోబెల్ బహుమతి విజేత రిచర్డ్ ఆక్సెల్ కూడా బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ ముగ్గురూ ఎప్‌స్టీన్ ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.వాల్ స్ట్రీట్ జెయింట్ గోల్డ్‌మన్ సాక్స్‌లో చట్టపరమైన విభాగం హెడ్ క్యాథీ రూమ్లెర్, హయాత్ హోటల్స్ వారసుడు థామస్ ప్రిట్‌జ్కర్ తమ స్థానాలు వదులుకున్నారు. గ్లోబల్ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ చైర్మన్ సుల్తాన్ అహ్మద్ బిన్ సులాయెం, నార్వే అంబాసిడర్ మోనా జుహానీ కూడా రాజీనామా చేశారు. ఈ లిస్ట్ రోజుకొకకొనసాగుతోంది, ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితి పెరుగుతోంది.ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో 170+ ప్రముఖుల పేర్లు వచ్చాయి. ఇందులో పొలిటీషియన్లు, బిజినెస్ టైకూన్లు, సైంటిస్టులు ఉన్నారు. ఈ ఆరోపణలు సెక్సువల్ ట్రాఫికింగ్, ఇన్‌ఫ్లుయెన్స్ ఫెడ్లింగ్‌కు సంబంధించినవి. ఫైనల్ కోర్ట్ ఆర్డర్‌తో ఈ ఫైల్స్ పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ రాజీనామాలు చిఓమనీనీ ఉద్యమం తర్వాత ఎలైట్ అకౌంటబిలిటీకి కొత్త ఎపాక్‌ను ప్రారంభిస్తున్నాయి. డబ్ల్యూఈఎఫ్ విశ్వసనీయత క్షీణించడంతో గ్లోబల్ పాలసీ చర్చలు ప్రభావితమవుతాయి. హార్వర్డ్‌లో నాయకత్వ షేకప్ విద్యా రంగంలో పరిణామాలకు దారితీస్తుంది. ఫైనాన్షియల్ రంగంలో గోల్డ్‌మన్ సాక్స్ షేర్లు 5 శాతం పడిపోయాయి, మార్కెట్ అనిశ్చితి పెరిగింది.

# నిలిచిపోయిన రొయ్యల, చేపల కంటైనర్లు



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :**యుద్ధ జ్వాలలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం పెట్రోల్ ధరలకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగాన్ని, తెలంగాణ పౌల్ట్రీ రంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు అమాంతం ఆగిపోయాయి. తాజా నివేదికల ప్రకారం.. సుమారు 300 మిలియన్ డాలర్ల విలువైన సీ ఫుడ్ కంటైనర్లు వివిధ పోర్టుల్లో నిలిచిపోయాయి. ఈ భారీ నష్టంలో దాదాపు 60 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దే కావడం ఆందోళనకరం. విశాఖపట్నం, ముంబై పోర్టుల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన రొయ్యలు, చేపల కంటైనర్లు కదలడం లేదు. ఎర్ర సముద్రం, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మార్గాల్లో దాడుల భయంతో షిప్పింగ్ నిలిచిపోయిందిఒకవైపు ఎగుమతులు ఆగిపోతుంటే.. మరోవైపు షిప్పింగ్ కంపెనీలు చార్జీలను రెట్టింపు చేశాయి. ఒక్కో కంటైనర్‌పై 1500 నుండి 4000 డాలర్ల వరకు ఎమర్జెన్సీ సర్‌చార్జీలు వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా రొయ్యలు పాడవకుండా ఉంచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. "అమెరికా టారిఫ్‌ల దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో.. ఈ యుద్ధం మా వెన్ను విరిచింది" అని సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ తెలిపింది. కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడంతో, స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనివల్ల పల్లెల్లో రొయ్యల ధరలు దారుణంగా పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.యుద్ధం ప్రభావం కేవలం సముద్ర ఉత్పత్తులపైనే కాదు మన పౌల్ట్రీ రంగంపై కూడా తీవ్రంగా పడింది.

హైదరాబాద్, నామక్కల్ ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన గుడ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. ఎగుమతులు ఆగడంతో స్థానిక మార్కెట్‌లో గుడ్ల నిల్వలు పెరిగి, ధరలు పడిపోతున్నాయి. దీనివల్ల పౌల్ట్రీ రైతులకు రోజుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. భారత హలాల్ మాంసం ఎగుమతుల్లో సగానికి పైగా వాటా గల్ఫ్ దేశాలదే. ఇప్పుడు ఇన్సూరెన్స్ రేట్లు పెరగడం, కంటైనర్లు ముంబై పోర్టులోనే ఆగిపోవడంతో వేలాది టన్నుల మాంసం పాడైపోయే పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్ రేట్ల గురించి సామాన్యుడు భయపడుతుంటే.. అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు మూసుకుపోవడంతో తెలుగు రైతు తన పెట్టుబడి ఎక్కడ సముద్రం పాలవుతుందోనని బిక్కుబిక్కుమంటున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎగుమతిదారులకు, రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అరటిపై ప్రభావం: వెంకీ పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది అరటి రైతుల పరిస్థితి. ఎక్కడో అమెరికా ఇరాన్‌పై దాడి చేసి యుద్ధం చేస్తుంటే ఆ ప్రభావం కర్నూలు జిల్లా అరటి రైతులకు తీవ్రంగా పడింది వారి పాలిట శాపంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు అరటి పంటలు భారీగా సాగు చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం కన్ను ఒకటి వెయ్యి నుంచి 2000 ఉండేది. అరటి కోసే కూలీలకు కూడా ఆ ధర సరిపోక రైతులు ఎక్కడపడితే అక్కడ పారవేశారు. ఇంకా కొన్ని అయితే పశువులకు మేతగా వేశారు. ఆ తర్వాత పుంజుకుని టన్ను అరటి 25 వేల వరకు వెళ్ళింది. ఇరాన్ పై అమెరికా దాడి చేయకముందు వరకు ఆ ధర పలికింది. ఖర్చులన్నీ కూడా కరెంటు రైతులకు ఎకరాలు రెండు లక్షలకు పైగా మిగిలేది. గల్ఫ్ యుద్ధంతో ఒక్కసారిగా పడిపోయింది . టన్ను అరటి ధర 10 వేలు కూడా రావడం లేదని, రెండు మూడు రోజుల వివాదిలోని 60 శాతం పైగా ధర పడిపోవడం తప్ప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ సహా గల్ఫ్ కంట్రీస్ కి యుద్ధం కారణంగా ఆ దేశాలకి అరటి ఎగుమతులు నిలిచిపోవడంతో ధర పతనమైనట్టు వ్యాపారులు రైతులు చెప్తున్నారు. ధర కోసం వేచి చూస్తే పొలంలోని అరటి మాగిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

### గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ,: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది (ఈ౹సబిత్తి÷తిళి౹స ÷ఔసతిఇ౹బ ఎనిటతిజీ). అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30 లక్షల టన్నుల యూరియా, 25.13 లక్షల టన్నుల డీఏపీ, 55.87 లక్షల టన్నుల ఎన్‌పీకేఎస్ నిల్వలున్నాయని పేర్కొంది.

## ఏపీకి కొత్త సీఎం ప్రచారం...

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అంతా సాఫీగా సాగుతున్నట్లు కనిపిస్తున్నా, తెరవెనుక జరుగుతున్న సోషల్ మీడియా ప్రచారం మాత్రం పొలిటికల్ సెగలు పుట్టిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, రాష్ట్ర పగ్గాలను తనయుడు లోకేష్‌కో లేదా మిత్రపక్ష నాయకుడు పవన్ కల్యాణ్‌కో అప్పగిస్తారనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు కీలక మద్దతుదారుగా ఉండటంతో, ఆయనకు ఢిల్లీలో సముచిత స్థానం దక్కుతుందనేది కొందరి అంచనా. ఒకవేళ బాబు జాతీయ రాజకీయాలకు షిఫ్ట్ అయితే, రాష్ట్రంలో కొత్త నాయకత్వం అనివార్యమవుతుంది. అయితే, టీడీపీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, సహజంగానే చంద్రబాబు తన వారసుడిగా నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తారు. ఇప్పటికే లోకేష్ పరిపాలనలో చురుగ్గా ఉంటూ తనదైన ముద్ర వేస్తుండటం ఈ వాదనకు బలాన్నిస్తోంది.మరోవైపు, పవన్ కల్యాణ్ సీఎం కావాలనే డిమాండ్ ఆయన అభిమానుల నుంచే కాకుండా, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వంటి వారి వ్యాఖ్యల ద్వారా కూడా చర్చకు వస్తోంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు అన్న సూత్రాన్ని నమ్మేవారు పవన్ సీఎం అయ్యే అవకాశాలను కొట్టిపారేయడం లేదు. కూటమి గెలుపులో పవన్ పోషించిన కీలక పాత్రను దృష్టిలో ఉంచుకుని, చంద్రబాబు పెద్దమనసుతో ఆయనకు అవకాశం ఇస్తారా? అన్నది ఒక పెద్ద ప్రశ్న. అయితే, ఇది జరగాలంటే టీడీపీ ఎమ్మెల్యేల మద్దతు, ఆ పార్టీ అంతర్గత అంగీకారం తప్పనిసరి. చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నేత రాష్ట్రం నుంచి తప్పుకుంటే కూటమిలో నాయకత్వ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక , అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాలంటే బాబు అనుభవం అత్యవసరం. కేవలం వారసత్వం కోసమో లేదా మిత్రపక్షాల కోసమో సీఎం పదవిని వదులుకోవడం అంత సులభమైన నిర్ణయం కాకపోవచ్చు. లోకేష్ మరియు పవన్ మధ్య అధికార పంపిణీ విషయంలో ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు.అసలు కూటమి పార్టీల మధ్య ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి చర్చ జరగకపోయినా, ప్రతిపక్షాల విమర్శలు, సోషల్ మీడియా విశ్లేషణలు ప్రజల్లో అయోమయాన్ని కలిగిస్తున్నాయి. బాబు ఢిల్లీకి వెళ్తారా? లోకేష్‌కి పట్టాభిషేకం చేస్తారా? లేక పవన్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టి కింగ్ మేకర్‌గా నిలుస్తారా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఈ సీఎం కుర్చీ వార్తలు మాత్రం ఏపీ రాజకీయాల్లో కొత్త రకమైన ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

# ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదు

## ప్రపంచం నెత్తిన చమురు సంక్షోభం !

చమురు ధరలు దారుణంగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్‌పై యుద్ధం కారణంగా భారత్ సహా అనేక దేశాలు ఇంధన సమస్యలు ఎదుర్కోబోతున్నాయి. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచేశారు. సిలిండర్‌పై 80 రూపాయాలు పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేవలం గృహ వినయోగ సిలిండర్లనే సరఫరా చేయాలని నిర్ణయించారు. కమర్షియల్ సిలిండర్లపై ఆంక్షలు విధించారు. కేవలం గృహావసరాలకే సరఫరా చేయాలని దేశాలు ఇచ్చారు. ఇకపోతే విదేశాల్లో సైతం కార్ల ఇంధన ధరలు పెరిగాయి. అమెరికాలోనూ గ్యాస్ ధరలతో అక్కడి వారు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్నది. పది రోజులుగా వరుస దాడులు జరుగుతున్నాయి. ఇది ఇంకెంత కాలం సాగుతుందో చెప్పలేం. హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా చమురు నౌకలు కదిలే పరిస్థితి లేదు. అందుకే యుద్ధంతో భారత్ చమురు దిగుమతులకు ముప్పు ఏర్పడే ప్రమాదం కనిపిస్తున్నది. యూరప్‌లో చమురు ధరలు బ్యారెల్‌కు 20 డాలర్లు పెరిగి 80 డాలర్లకు చేరింది. హోర్మోజ్ జలసంధి కూడా మూతపడితే 100 డాలర్లకు కూడా చేరే ప్రమాదం పొంచి ఉన్నదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సూయిజ్ కాలువ, ఎర్ర సముద్రం నౌకాయానా నికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడుతున్నది. ఈ మార్గాల్లో భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటుంది. ఒకవేళ బ్యారెల్‌కు 10డాలర్ల చొప్పున పెరిగితే, మొత్తం 15 బిలియన్ డాలర్ల అధిక వ్యయం అవుతుంది. పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ ఒపెక్ ఉత్పత్తిని పెంచవచ్చు.కానీ దీర్ఘకాలికయుద్ధంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉన్నది. అంతేకాకుండా గల్ఫ్ దేశాలకు ఆర్థిక నష్టాలు, అమెరికా ప్రతిష్ఠకు విఘాతం కలిగే పరిస్థితులు నెల కొన్నాయి. యుద్ధ వాతావరణంతో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌తో పాటు పశ్చిమాసియాలోని ఆర్థిక వ్యవస్థలు, ప్రజల రోజువారీ జీవితాలను సంక్షోభం లోకి నెట్టేలా కనిపిస్తున్నది. ట్రంప్ మూర్ఖపు నిర్ణయం కారణంగా ప్రపంచం మొత్తం ఆర్థిక చక్రబంధంలో ఇరుక్కోవాలసి వస్తోంది. చమురు సరఫరా మార్గాల్లో అంతరాయల వల్ల వాటి ధరలు విపరీతంగా పెరిగి, దీర్ఘకాలికంగా ప్రతికూల ప్రభావం పడుతుంది. చమురు ధరలు పెరగడంతో వాల్‌స్ట్రీట్ 800 పాయింట్లు పడిపోయింది. పెట్రోల్, ఆహారం సహా అన్నింటి ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చమురు కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టవచ్చు. కానీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అమెరికాకు దేశీయంగా చమురు ఉత్పత్తి ఎక్కువగా ఉండటం కొంత ఉపశమనం కావొచ్చు. కానీ ఇరాన్ బలాన్ని పట్టించుకోకపోతే ఇది ఇరాక్ యుద్ధంలా పెద్ద తప్పుగా మారే ప్రమాదం ఉన్నదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఈ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం జరిగినా, రష్యా, చైనా ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగినా అత్యంత ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. ఈ యుద్ధం వల్ల జపాన్ వంటి ఆసియా దేశాలు అమెరికాపై నమ్మకం కోల్పోయి డాలర్‌కు దూరమయ్యే ప్రమాదం కూడా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. అమెరికా- ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తిప్పి కొట్టేందుకు ఇరాన్ చేస్తున్న ప్రతిదాడుల కారణంగానే ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఇరాన్ తలొగ్గేది లేదని, లొంగిపోయేది లేదని తేల్చి చెప్పింది. ఇరాన్‌ను ధ్వంసం చేసే వరకు ట్రంప్ నిద్రపోయేలా కనిపించడం లేదు. ఇప్పటికే టర్కీ నుంచి దుబాయి వరకు అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు, పోర్టులు, చమురు శుద్ధి కేంద్రాలు, విమానాశ్రయాలు ఇలా 27 ప్రాంతాలపై ఇరాను విరుచుకుపడింది. ఇవన్నీ కూడా తక్కువ ఖర్చుతో కూడిన డ్రోన్‌ల ద్వారానే జరిపినట్టు తెలిసింది. రవాణా మార్గాలపై ఈ దాడులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దుబాయి, సౌదీ అరేబియా కూడా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయాయి. ఇరాన్ వినియోగిస్తున్న ఆధునిక ఆయుధాలను దుబాయి, సౌదీ అరేబియా బలహీనమైన రక్షణ వ్యవస్థలు దీటుగా ఎదుర్కోలేకపోతున్నాయి.



పెద్ద కంపెనీలు కార్యకలాపాలు నిలిపివేశాయి. దుబాయిలోని 50 లక్షల మంది భారతీయులపైనా ప్రభావం పడుతున్నది. ప్రస్తుత యుద్ధం కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్ కాలంలో రూపొందిం చిన పాత సరిహద్దులు కూడా మారిపోయే అవకాశం ఉన్నది. సంక్షోభంగా కారణంగా గల్ఫ్ రాజ్యాల్లో నిరుద్యోగం పెరిగితే ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంది. అమెరికా సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని ఇరాక్‌లో డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై జరిగిన దాడుల పట్ల టర్కీ సంతోషం గానే ఉన్నదని కొందరు భావిస్తున్నారు. యుద్ధ వాతావరణంలో యూరప్ మాటలకే పరిమితమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. భారత్ చౌకైన రష్యా చమురుపై ఆధారపడుతున్నది. చైనా తన వాణిజ్య మార్గాలను, నౌకాశ్రయాలను రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. దాడుల కారణంగా ఇరాన్ ప్రజలు తమ అత్యున్నత నాయకుడిని కోల్పోయారు. ఇరాన్ సైనిక కేంద్రాలపై అమెరికా 1,700 దాడులు చేసింది. ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రతిస్పందిస్తున్నది. పర్షియన్ నాగరికతకు చెందిన దీర్ఘ చరిత్ర కారణంగా ప్రజలు ఐక్యంగా నిలుస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఆ దేశంలో పెద్దగా కల్లోలం కనిపించడంలేదు. రష్యా, చైనా మద్దతుతో యుద్ధం నిలువగలిగితే ప్రపంచానికి అది విజయం అవుతుంది.

## భూ ఆక్రమణలపై పిడి యాక్ట్ ఏమయ్యింది

### దురాక్రమణదారులపై దమ్ముంటే చర్య తీసుకోవాలి గీతం వర్సిటీ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిందే సిపిఎ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

**విజయవాడ,తెలంగాణ దిశ :**అతి పెద్ద భూ దురాక్రణదారు ప్రభుత్వమేనని సిపిఎం విమర్శించింది. ప్రభుత్వ, పేదల భూములాక్రమించిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. భూ అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించిన ముఖ్యమంత్రి భూ దురాక్రమణలకు పాల్పడిన పెత్తందార్లు, కార్పొరేట్లు, ప్రజా ప్రతినిధులపై చర్య తీసుకొని తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ' మీ భూమి మీ హక్కు అంటున్న చంద్రబాబు నాయుడు గారు ఆచరణలో 'మీ భూమి మా హక్కు ' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అవసరం వున్నా లేకున్నా అభివృద్ధి జపం చేస్తూ వేలాది ఎకరాలను రైతుల నుండి వారి ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా సర్కార్ బలవంతంగా గుంజుకుంటున్నదని ధ్వజమెత్తారు.

## హామీ మేరకు అంగన్‌వాడీలను ఆదుకోవాలి

### జీతాలు పెంచి వెంటనే అమలు చేయాలి అంగన్‌వాడీ ప్రతినిధుల డిమాండ్

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఇటీవల అంగన్‌వాడీ ఉద్యోగులు మరోమారు కదం తొక్కారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అయితే వారి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటిం చారు. నిజానికి వేతనాలు పెంచుతామని, వారి సమస్యలు పరిష్కరిస్తా మని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి హామీలు గుప్పించింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక నిర్బంధం విధించడం దారుణం. శాంతియుతంగా మహా ధర్నా నిర్వహించి, శిబిరంలోనే నిద్రిస్తున్న వెయ్యిమందికిపైగా మహిళల పట్ల అమానుషంగా వ్యవహరించింది. పిన్నులతో గుచ్చడం, తాళ్లు వేసి, ముసుగుగుడ్డ కప్పి బలవంతంగా వ్యానుల్లో కుక్కడం, బ్యాగులు, సెల్‌ఫోన్లు సైతం తీసుకోనీయకపోవ డం, అరెస్టు చేసి వంద కిలోమీటర్లకు పైగా దూరంలోని ప్రాంతాలకు తరలించడం చూశాం. దీనిపై సిఎం చంద్రబాబు ఎక్కడా కనీసం విచారం ప్రకటించలేదు. అంగన్‌వాడీ ఉద్యోగుల నియామకంలో కాంట్రాక్టర్లు, ఏజెంట్లు వంటి మధ్యవర్తులెవరూ ఉండరు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల్లో చిట్టచివర ఉన్న వారికి చెల్లించే కనీస వేతనం, డిఎ, ఇతర అలవెన్సులు కలిపి రూ.26 వేలు ఇవ్వాలి. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇవేవీ వారికి అమలు చేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని నాటి జగన్‌మో




హన్‌రెడ్డి ప్రభుత్వం మాటమార్చి, అంగన్‌వాడీ ఉద్యమంపై ఎస్మా ప్రయోగించి అప్రతిష్ట పాలైంది. 42 రోజుల సమ్మె అనంతరం సమస్యలపై ఒప్పందం చేసుకుంది. నాటి ఉద్యమానికి మద్దతు ప్రకటించి, మెరుగైన వేతనాలిస్తామని ఊరూవాడా శిబిరాల్లో ప్రకటించిన టిడిపి కూటమి నేతలు ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవా లి. చట్టసభా వేదికగా మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. 2024 జూన్ నుంచి వేతనం పెంచుతామని గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని సైతం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. తెలంగాణలో రూ.2,150 అధిక వేతనం ఇస్తున్నారు. మరో రూ.5 వేలు పెంచుతామని ఆ రాష్ట్ర మంత్రి ప్రకటించారు. చాలా రాష్టాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. ఏడేళ్లుగా వేతనాలు పెరగకపోవడం, ధరలు విపరీతంగా పెరగడంతో జీవనం దుర్భరంగా మారడం, అధికారంలోకి వచ్చి 22 నెలలైన తరువాత కూడా సర్కారులో చలనం లేకపోవడం వల్లే మహాధర్నాకు దిగామరి అంగన్‌వాడీలు అన్నారు.

## ఫ్యామిలీని రాజకీయాల్లోకి తీసుకురావొద్దు

**విజయవాడ,తెలంగాణ దిశ :**సాధారణంగా రాజకీయ పార్టీల అధినేతలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత, వారి కుటుంబ సభ్యుల హడావుడి ఎక్కువగా ఉంటుందనే మాట వాస్తవం. పార్టీలో, ప్రభుత్వంలో వారి పెత్తనం నడుస్తూ ఉంటుంది. గతంలో ఎందరో రాజకీయ నాయకులు.. ఈ తరహాలో విమర్శలు ఎదుర్కొన్న వారే. తెలంగాణలో 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో విమర్శలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చిన విషయంలో, ప్రతిపక్షాలు అప్పట్లో తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి. ఇక 2023లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి విషయంలో కూడా ఇదే తరహాలో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల్లో.. ఆయన సోదరుల పెత్తనం ప్రభుత్వంపై ఎక్కువగా ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. ఇక పార్టీ నేతలు కూడా ఏదైనా కావాలంటే వారి వద్దకు వెళుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏపీలో జగన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా.. ఇదే తరహాలో ఆరోపణలు వచ్చాయి. వైఎస్ కుటుంబం ప్రభుత్వం పై పెత్తనం చేలాయిస్తుందని, కొంతమంది ఆరోపణలు చేశారు. దీనితో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో కాస్త జాగ్రత్త పడుతున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ.. అమరావతి రాకుండా పవన్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబుకు కూడా పవన్ కళ్యాణ్.. ఈ అంశానికి సంబంధించి ఓ క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. అనవసరంగా కుటుంబ సభ్యులను అమరావతి తీసుకురావద్దని, సచివాలయానికి గాని, జనసేన పార్టీ కార్యాలయానికి గాని, వారిని దూరంగా ఉంచాలని సూచించారట. అలాగే జనసేన మంత్రులకు కూడా పవన్ కళ్యాణ్ ఇదే తరహాలో స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారం.

# ప్రకృతి కోసం పోరాడే 'కాట్టాన్'..





తమిళ నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటిస్తున్న తాజా సర్వైవల్ థ్రిల్లర్ 'కాట్టాన్'. ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో మార్చి 27న నేరుగా రాబోతున్న ఈ చిత్రం నుంచి చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. దట్టమైన అటవీ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విజయ్ సేతుపతి ఒక పవర్‌ఫుల్ అటవీ నివాసిగా, రగ్గడ్ లుక్‌లో కనిపిస్తూ తన పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేశారు. ప్రకృతిని కాపాడుకోవడానికి, అడవిపై ఆధారపడి జీవించే మనుషుల హక్కుల కోసం ఒక వ్యక్తి చేసే పోరాటమే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం అని తెలుస్తుంది. ట్రైలర్‌లో చూపించిన అద్భుతమైన విజువల్స్, అడవిలోని లోతైన ప్రాంతాల చిత్రీకరణ సినిమాటోగ్రఫీ స్థాయిని తెలియజేస్తుండగా, గ్రిప్పింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అదనపు ఆకర్షణగా నిలిచింది. మణికందన్ ఈ సినిమాకు కథను అందించడంతో పాటు బీ. అజిత్ కుమార్ అనే దర్శకుడితో కలిసి సంయుక్తంగా దర్శకత్వం వహించాడు. తమిళంతో పాటు, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది.

# అప్పలసూరిగా జగపతిబాబు



ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

# అల్లు సినిమాస్ స్పెషలేంటంటే...




హైదరాబాద్: భాగ్య నగరం లో సినిమా ప్రేమికులు ఎక్కువ. ఫలానా థియేటర్‌లో మంచి విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఉంటుందంటే... ఎంత దూరమైనా ట్రావెల్ చేస్తారు. ఫర్ ఎగ్జాంపుల్... ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లోని పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో సినిమా చూడటం కొందరికి ఓ అలవాటు!టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్ ఉన్న మన సినిమాలను, హాలీవుడ్ మూవీస్‌ను మంచి వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ కోసం పీసీఎక్స్ (లార్జ్) స్క్రీన్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో చూసే ప్రేక్షకులు కొందరు అయితే... వీకెండ్ ఫ్యామిలీతో కలిసి సినిమా చూడాలని ప్లాన్ చేసుకునే వాళ్ళు ఇంకొందరు. ఆ సినీ ప్రేమికుల కోసం హైదరాబాద్ సిటీలో మరొక స్క్రీన్ వచ్చింది. 'అల్లు సినిమాస్'లోని డాల్బీ సినిమా స్క్రీన్. దాని స్పెషాలిటీ ఏమిటి? అందులో సినిమా ఎందుకు చూడాలి? అంటే... ఇప్పటి వరకు హైదరాబాద్ సిటీలోని పలు థియేటర్లలో మీరు త్రీడీ సినిమా చూసి ఉండొచ్చు. అయితే... ఒక్కసారి 'అల్లు సినిమాస్'లోని స్క్రీన్ 1 (డాల్బీ సినిమా)లో త్రీడీ ఫిల్మ్ చూడండి. 'ది బెస్ట్ సినిమాటిక్' ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో అసలు సందేహం అవసరం లేదు. టాలీవుడ్ జర్నలిస్టులను అల్లు సినిమాస్ (థియేటర్ విజిట్)కు తీసుకు వెళ్ళారు. సీతా రాములుగా సాయి పల్లవి, రణబీర్ కపూర్... రావణుడిగా యశ్ నటిస్తున్న 'రామాయణ' గ్లింప్స్ ప్రదర్శించారు. త్రీడీ వ్యూయింగ్ ఎక్స్‌పీరియన్స్ సూపర్బ్ అని చెప్పాలి.'అల్లు సినిమాస్'లోని 'డాల్బీ సినిమా' స్క్రీన్‌లో మెయిన్ ఎట్రాక్షన్ ఒ స్పెషాలిటీ... సౌండ్ క్వాలిటీ. థియేటర్ టోటల్ సీటింగ్ కెపాసిటీ 634. ఇందులో టోటల్ 78 స్పీకర్స్, 165 సౌండ్ ఔట్ లెట్స్ ఉన్నాయి. ప్రస్తుతానికి (మార్చి 12, 2026)కు ఇండియాలోని అతిపెద్ద డాల్బీ సినిమా స్క్రీన్ ఇదే. హైదరాబాద్ సిటీలో మొట్టమొదటి స్క్రీన్ కూడా! ఇది ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా ఆడిటోరియం కూడా!'అల్లు సినిమాస్' డాల్బీ సినిమా స్క్రీన్‌లో సౌండ్ క్వాలిటీ సూపర్బ్ అని చెప్పవచ్చు. వరల్డ్ క్లాస్ లెవల్ హియరింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ప్రతి చిన్న సౌండ్, బీట్ చాలా స్పష్టంగా వినబడుతుంది. అందువల్ల ఆర్ఆర్ (నేపథ్య సంగీతం) పరంగా ఈ స్క్రీన్ నెక్స్ట్ లెవల్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది.

విజువల్ ఎక్స్‌పీరియన్స్ కూడా సూపర్బ్: ప్రపంచంలోని అతి పెద్ద స్క్రీన్‌లలో అల్లు సినిమా డాల్బీ సినిమా స్క్రీన్ ఒకటి. ఈ స్క్రీన్ సైజ్ 75 అడుగుల వెడల్పుతో ఉంది. ఫ్లాట్ యాస్పెక్ట్ రేషియోలో ఇందులో సినిమాలను ప్రదర్శించనున్నారు. ఇండియాలో ఇంత పెద్ద డాల్బీ సినిమా స్క్రీన్, హైదరాబాద్‌లోనూ ఇంతకు ముందు లేదు. డాల్బీ సినిమా డిజైన్ ప్రమాణాల ప్రకారం... డ్యూయల్ డాల్బీ విజన్, 6ఖ లేజర్ ప్రొజెక్షన్ సిస్టమ్ కలిగి ఉంది. ఎక్స్‌ట్రీమ్ బ్రైట్ నెస్, డీపర్ బ్లాక్స్, రిచ్‌లీ వైబ్రెంట్ కలర్స్‌తో ఈ సినిమా హాలులో విజువల్ క్వాలిటీ కూడా ది బెస్ట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని చెప్పడంలో సందేహం అవసరం లేదు.ఫ్లాగ్ షిప్ డాల్బీ సినిమా స్క్రీన్ కాకుండా 'అల్లు సినిమాస్'లో మరో మూడు స్క్రీన్‌లు ఉన్నాయి. వాటిలో బార్కో 4ఐ లేజర్ ప్రొజెక్షన్, డాల్బీ అట్మోస్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి. ఆ మూడింటి సీటింగ్ కెపాసిటీ 717 సీట్లు.

# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు

టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణేశిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసింది, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణేశిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణేశిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్–అర్జున్ సంగీతాన్ని అందించారు.



## డేట్స్ కుదరక దురంధర్ వదులుకున్నా

# సీనియర్ నటుడు అనిల్ కపూర్ వెల్లడి

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'ధురంధర్ 2' రణ్‌వీర్ సింగ్ ప్రధానపాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో తాను అతిథి పాత్ర వదులుకోవాల్సి వచ్చిందని బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ సినిమాలో ఓ కీలక అతిథి పాత్ర కోసం ఆదిత్య నన్ను సంప్రదించారు. అందులో నటించాలని నేనూ కోరుకున్నా. కానీ, ఆ సమయంలో అప్పటికే మరో దర్శకుడికి డేట్స్ ఇచ్చేశాను. దీంతో 'ధురంధర్ 2'లో నటించలేకపోయాను. ఒకరికి ఇచ్చిన డేట్స్‌ను క్యాన్సిల్ చేసి.. మరో సినిమాను అంగీకరించడం సమంజసం కాదు. అందులో నటించే అవకాశం కోల్పోవడం నా దురదృష్టమే.. కానీ నా బాధ్యత ముందు ఇది చిన్న విషయం. నాకు వృత్తిపై ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. చిత్రపరిశ్రమలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు. ఇచ్చిన మాట మీద నిలబడటం చాలా ముఖ్యం అని అనిల్ కపూర్ చెప్పారు. భవిష్యత్తులో ఆదిత్య సినిమాలో నటించే అవకాశం రావాలని కోరుకున్నారు. 'ధురంధర్' సూపర్ హిట్ కావడంతో దీని సీక్వెల్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. ప్రీబుకింగ్స్‌లో ఈ చిత్రం హవా చూపిస్తోంది. ఇప్పటి వరకూ కేవలం పెయిడ్ ప్రీమియర్స్, అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే రూ.27 కోట్లు వసూళ్లు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకూ 5లక్షలకు పైగా టికెట్స్ సేల్ అయినట్లు తెలుస్తోంది. ఇంకా విడుదలకు సమయం ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 9530 థియేటర్స్‌లో ఈ చిత్రం విడుదల కానుంది.



# సముద్ర ఖని కార్మేని సెల్వం

నేటి ఆధునిక కాలంలో డబ్బు, కుటుంబం మరియు మనుషుల ఆశయాల చుట్టూ తిరిగే ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'కార్మేని సెల్వం'. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా, రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళంలో రూపొందిన ఈ ద్విభాషా చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సముద్రఖని కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్ర పోషించగా, లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ప్రముఖ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, యువరాజ్ దక్షన్ ఛాయాగ్రహణం అందించారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలు ఉన్నాయి అంటూ విలక్షణ నటుడు సముద్రఖని చెప్పే పవర్‌ఫుల్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ఈ టీజర్, నేటి సమాజంలో ఉన్న ఆర్థిక సవాళ్లను కళ్ళకు కట్టినట్లు చూపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ కల్చర్, ఈఎంఐల భారం, క్రిప్టో లో పెట్టుబడులు మరియు త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు మధ్యతరగతి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఇందులో అర్థవంతంగా చూపించారు. సముద్రఖని తన కుటుంబంతో గడిపే హృద్యమైన సన్నివేశాలు ఒకవైపు, విదేశాల్లో ఒంటరిగా కనిపించే దృశ్యాలు మరోవైపు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. టీజర్ చివర్లో 'రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలి? డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి' అని సముద్రఖని చెప్పే డైలాగ్ నేటి వినియోగదారి తత్వానికి అద్దం పడుతోంది. సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ విలువలతో రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.




Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215